ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

3

ఆదివారం 11 ఫిబ్రవరి 2024



ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన పైపులైను వాల్వుల వద్ద ఏర్పడిన లీకుల వద్ద డ్రైనేజీ నీరు

గుంటూరు నగరంలో మరోసారి డయేరియా ప్రబలింది. పైప్‌లైన్ల లీకుల కారణంగా నీరు కలుషితం అయి నగర ప్రజలు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. పెద్ద సంఖ్యలో నగరవాసులు కలరాతో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో చేరుతున్నారు. ఇప్పటికే ఇద్దరు మృతి చెందగా గుంటూరు సమగ్ర ప్రభుత్వ ఆస్పత్రిలో 19మంది చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో చిన్నారులు కూడా ఉన్నారు. తీవ్రమైన వాంతులు, విరోచనాలతో నీరసించి పడకలపై సొమ్మసిల్లి పడి ఉన్న చిన్నారులను చూస్తే హృదయం ద్రవిస్తోంది. ఆరేళ్ల తర్వాత మరోసారి కలరా గుంటూరుపై పంజా విసరడం కలకలం రేపుతోంది.

డయేరియా.. పంజా



చికిత్స పొందుతున్న చిన్నారులు



మేయర్, కమిషనర్‌ను నిలదీస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

- గుంటూరు నగరలో ప్రబలిన డయేరియా
- పలు కాలనీల్లో తాగు నీరు కలుషితం
- పైపులైన్ ద్వారా పలు ప్రాంతాల్లో మురుగునీటి సరఫరా
- వాంతులు, విరేచనాలతో ప్రజలు ఆసుపత్రుల పాలు
- ఇద్దరు మృతి, జీజీహెచ్‌లో 24 మందికి చికిత్స
- వందల సంఖ్యలో ప్రైవేటు వైద్యశాలల్లో బాధితులు
- పరామర్శించిన టీడీపీ, జనసేన నేతలు
- ఇంజనీరింగ్ అధికారుల బాధ్యతారాహిత్యం
- డీఈఈ శ్రీనివాసరెడ్డిని సరెండర్ చేసిన కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్, మెడికల్), ఫిబ్రవరి 10: గుంటూరు నగరంలో కలరా (ఎక్యూట్ డయేరియల్ డిసీజ్) ప్రబలింది. పలు కాలనీల్లో మంచినీటిని పైపుల్లో ఏర్పడిన లీకేజీలతో నీరు కలుషిత పెద్దసంఖ్యలో నగరవాసులు కలరా బారిన పడ్డారు. వాంతులు విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శారద కాలనీ, శ్రీనగర్, సంగడిగుంట, అహ్మద్ నగర్, తిరుమలాచారి కాలనీల్లో వందల సంఖ్యలో ప్రజలు ఆసుపత్రుల పాలయ్యారు.బాధితుల్లో పలువురు ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్సలు పొందుతున్నారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న 26 మందిని జీజీహెచ్‌కు తరలించారు. వీరిలో కలరా తీవ్రతతో బుధవారం సంగడిగుంట సమీపంలోని తిరుమలాచారి కాలనీకి చెందిన కొర్రపాటి ఓబులు (50), శనివారం శారదా కాలనీకి చెందిన శీల పద్మావతి (17) అనే యువతి మృతి చెందారు. నాలుగు రోజులుగా కలరా ప్రబలినా. కట్టడి చర్యలు తీసుకోవడంలో నగర పాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఫలితంగా రెండు నిండు ప్రాణాలు బలయ్యాయి. దీంతో శనివారం ఉలిక్కిపడ్డ అధికారులు హడావిడిగా దిద్దుబాటు చర్యలకు దిగారు.

ఆరేళ్ల కిందట

గుంటూరు నగరంలో కలరా ప్రబలగా, అప్పట్లో 16 మంది మృతి చెందారు. వేల సంఖ్యలో బాధితులు ఆసుపత్రుల పాలయ్యారు.

ఇంజనీరింగ్ అధికారుల బాధ్యతారాహిత్యం..

గుంటూరు నగరపాలసంస్థలో ఇంజనీరింగ్ అధికారుల బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం నగర ప్రజలకు శాపంగా మారింది. పైప్‌లైన్ లీకుల ద్వారా మురుగునీటి సరఫరా అవుతున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. లీకుల పేరిట లక్షల రూపాయలను దోపిడీ చేస్తున్నారే తప్ప శాశ్వతంగా లీకులకు మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో నగరంలో అనేక ప్రాంతాల్లో లీకులు ఏర్పడి పైపులైన్ల ద్వారా మురుగునీరు సరఫరా అవుతోంది. వసంత రాయపురం మెయిన్ రోడ్ , బీఆర్‌స్టేడియం ఎదుట, ఇన్నర్‌రింగ్ రోడ్డు విజయ్ డిజిటల్ దగ్గర, శారదా కాలనీ, కొరటిపాడు, ఏటీ అగ్రహారం, లక్ష్మీ నగర్, ఆనందపేట, ఇలా అనేక ప్రాంతాల్లో పైపులైన్లకు లీక్‌లు ఏర్పడుతున్నాయి.

డీఈఈ శ్రీనివాస్‌రెడ్డిపై వేటు..

విధుల పట్ల నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా ఉంటున్న కార్పొరేషన్ డీఈఈ ఐ.శ్రీనివాస్‌రెడ్డిపై కమిషనర్ కీర్తి చేకూరి చర్యలు తీసుకున్నారు. అతన్ని ఈఎన్‌సీకి సరెండర్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం డయేరియా ప్రబలుతున్న సంగడిగుంట, శారద కాలనీలకు చెందిన ఏఈలపై కూడా చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలుస్తోంది.



యువతి మృతదేహం దగ్గర టీడీపీ నేతలు

ముందే హెచ్చరించినా..

గుంటూరు నగరంలో పలు ప్రాంతాల్లో పైపులైన్ లీకేజీలతో డయేరియా ప్రబలిందని, అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఆంధ్రజ్యోతి ఈ నెల ఏడో తేదీన "డయేరియాతో ఒకరి మృతి" అనే శీర్షికన వార్తా కథనం ప్రచురించింది. అయితే దీనిపై నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు తేలిగ్గా తీసుకున్నారు. డయేరియాతో ఓబులేసు మృతి చెందినా అతడు హృద్రోగంతో మృతిచెందాడని, నీరు కలుషితం కాలేదని చెప్పి అధికారులు పత్రికా ప్రకటన జారీ చేసి చేతులు దులుపుకోన్నారు. తీరా శనివారం డయేరియా కాస్తా తీవ్ర రూపు దాల్చే వరకూ అధికారుల్లో కదలిక రాలేదు. పద్మావతి వాంతులు, విరేచనాలతో మృతి చెందటంతో పరిస్థితి తీవ్రత తెలిసి వచ్చింది. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, డిప్యూటీ మేయర్ బాల వజ్రబాబు, వైసీపీ తూర్పు ఇన్‌చార్జ్ నూరిఫాతిమా, కమిషనర్ కీర్తి చేకూరి తదితరులు శనివారం జీజీహెచ్ క్యాజువాల్టీకి వచ్చి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వపరంగా పద్మావతి కుటుంబ సభ్యులను ఆదుకుంటామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుంటూరు వైద్య కళాశాలలోని రీజనల్ వాటర్ ల్యాబొరేటరీ సిబ్బంది, కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు ఆయా కాలనీల్లో తాగునీటిని పరీక్షల కోసం సేకరించారు.

పైపులైన్ల వాల్వుల వద్ద లీకులు

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్ర జ్యోతి): పంపింగ్ మెయిన్, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లలో నీటి ఒరవడిని నియంత్రణలో పెట్టేందుకు ఏర్పాటు చేస్తున్న వాల్వుల నుంచి తాగు నీరు లీకు అవుతోంది. దాంతో ఆ నీటిలోనే వాల్వులు మునిగిపోతున్నాయి. ఎప్పుడైతే ఆయా పైపులైన్లలో నీటి సరఫరా నిలుస్తుందో అప్పుడు ఆ మురుగునీరు అదే లీకులో నుంచి పైపులైనులోకి చేరుతుంది. దాంతో కుళాయిల ద్వారా ప్రజలకు కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఈ విషయాన్ని ఇంజనీరింగ్ అధికారులు తేలికగా కొట్టిపారేస్తున్నారు. ప్రస్తుతం నగరంలో చాలా ప్రాంతాల్లో కలుషిత నీటి సరఫరా జరుగుతూ ప్రజలు తీవ్ర అనారోగ్యంబారిన పడుతుండటానికి ఈ వాల్వుల వద్ద లీకులు కూడా ఒక కారణమన్న విషయం బహిరంగ రహస్యమే.

నగరంలో రోడ్ల విస్తరణలో భాగంగా పలుచోట్ల పాత పైపులైన్లు తొలగించి కొత్త లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో అసలు జాగ్రత్తలు తీసుకోవడం లేదు. కొత్తవి ఏర్పాటు చేసేటప్పుడు డ్రైనేజీ నీరు వాటిల్లోకి చేరుతున్నది. ఆ నీటిని ఎక్కడైనా స్కవర్ వాల్వు వద్ద ఓపెన్ చేసి బయటకు పంపించేయాలి. ఆ తర్వాతే తాగునీటిని విడుదల చేయాలి. అయితే ఈ పని చేయకుండా ప్రజలు వాళ్ల చావు వాళ్లు చస్తారులేనన్నట్లుగా పైపులైన్లను స్కవర్ చేయకుండా నీటిని విడుదల చేస్తున్నారు. దాంతో పైపులైన్లలోకి చేరిన డ్రైనేజీ నీరు అంతా సరఫరా సమయంలో కుళాయిల నుంచి ప్రజల ఇళ్లలోకి చేరుతున్నది. మురుగు/బురదరంగు నీటిని అయితే ఎలాగోలా ప్రజలు గుర్తించగలుగుతున్నారు. క్లోరిన్ శాతం నామమాత్రంగా కూడా లేకుండా సాదారణ నీటి వలే ఉన్న వాటిని గుర్తించలేకపోతున్నారు.

వాటర్ సప్లైకి ప్రాధాన్యం ఇవ్వని ఇంజనీర్లు

ఇంజనీరింగ్ అధికారులు తాగునీటి సరఫరాకి పెద్ద ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ఎంతసేపటికి వారి ధ్యాస అంతా వర్కుల మీదనే ఉంటుంది. ఇందుకు కారణం వాటిల్లోనే ఎక్కువగా పర్సంటేజీలు అందేది. ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు, ఫిట్టర్లు పేరుకు ఉన్నా వారికి ఏ రోజు కూడా చొక్కా నలగదు. ఏ పనిని అయినా సరే గడ్డిపాడులో నివసించే గ్యాంగ్‌వర్కర్ల ద్వారానే చేయిస్తుంటారు. గుంత తవ్వాలన్నా, కుళాయి కనెక్షన్ ఇవ్వాలన్నా, లీకుని అరికట్టాలన్నా, చివరాఖరికి క్వాలిటీ చెక్ చేయాలన్నా వారికే చెబుతుంటారు. ఇది కూడా కలుషిత నీటి సరఫరాకు ఒక కారణంగా మారుతోంది.

20 పడకలు ఏర్పాటు..

గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి క్యాజువాల్టీలో కలరా బాధితుల కోసం 20 పడకలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. తాత్కాలింగా పది పడకలతో ప్రత్యేక ఐసీయూ వార్డును సిద్ధం చేసి చికిత్సలు అందిస్తున్నారు. శనివారం రాత్రికి మరికొంత మంది బాధితులు చికిత్స కోసం జీజీహెచ్‌లో చేరే అవకాశం ఉండటంతో దీనికి తగినటట్టు వైద్య సిబ్బందిని సిద్ధం చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ యేకుల కిరణ్ కుమార్ తెలిపారు.

కలుషిత నీటి సరఫరాపై కలెక్టర్ పర్యవేక్షణ

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో కలుషిత నీటి సరఫరా జరిగి పలు ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్యం భారిన పడటంపై జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన నగరపాలకసంస్థ కమిషనర్‌తో పాటు ఇతర అధికారులతో శనివారం సాయంత్రం సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. కలుషిత నీటిసరఫరా జరగడానికి దారి తీస్తున్న కారణాలను అడిగి తెలుసుకొన్నారు. పరిస్థితి మరింత దిగజారకుండా అవసరమైన చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. డయేరియా లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరిన వారి వివరాలు తెలుసుకొని ఆయా ప్రాంతాలకు వైద్య బృందాలను పంపించి ప్రతీ ఒక్కరికి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. తాగునీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నగరపాలకసంస్థలో కంట్రోల్ రూం 24 గంటలు పని చేసేలా చూడాలని అన్నారు. ప్రజలంతా తాగునీటిని బాగా మరగకాచి చల్లారిన తర్వాత వడకట్టుకొని తాగేలా అవగాహన కల్పించాలన్నారు.

ఆరోగ్య శాఖ మంత్రి ఎక్కడ?

పెద్ద సంఖ్యలో నగరవాసులు కలరాతో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో చేరినట్లు తెలియడంతో.. శనివారం తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీల నేతలు ప్రభుత్వాస్పత్రి క్యాజువాల్టీకి వచ్చి బాధితుల కుటుంబాలను పరామర్శించారు. టీడీపీ నేతలు నసీర్ అహ్మద్, కనపర్తి శ్రీనివాసరావు, జనసేన నేతలు గాదె వెంకటేశ్వరరావు, నేరెళ్ల సురేష్, ఆళ్లహరి, సీపీఐ నేతలు జంగాల అజయ్‌కుమార్ తదితరులు ఆసుపత్రిలో ఆందోళన చేపట్టారు. మేయర్, కమిషనర్‌కు తమ నిరసనలు తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాలుగు రోజుల కిందటే అతిసారం ప్రబలిందని, జాగ్రత్తలు తీసుకోవాలని కార్పొరేషన్ అధికారులను కోరినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారని నసీర్ ఆరోపించారు. కలరా ప్రబలి వందల సంఖ్యలో ప్రజలు ఆసుపత్రుల పాలైనా గుంటూరులోనే ఉంటున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనీ బాధితులను పరామర్శించకపోవడం దారుణమని ఆయన విమర్శించారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలశౌరి స్పందిస్తూ ఈ ఘటన తనను కలచివేసిందని, బాధితుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



జీజీహెచ్‌లో శనివారం రాత్రి మంత్రి విడదల రజనిని నిలదీస్తున్న బీజేపీ నేతలు

మంత్రి రజనిని అడ్డుకున్న బీజేపీ నేతలు

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కలుషిత నీటిని తాగి తీవ్ర అనారోగ్యం పాలై జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించేందుకు వచ్చిన మంత్రి విడదల రజనిని బీజేపీ నేతలు అడ్డుకున్నారు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో మంత్రి భారీ పోలీసు బందోబస్తు మధ్య జీజీహెచ్‌కి వచ్చారు. అప్పటికే అక్కడికి చేరుకున్న బీజేపీ నేతలు ఆమెని నిలదీశారు. కలుషిత నీటిసరఫరా చేసినందుకు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి, బీజేపీ నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మహిళ అయిన తనను అడ్డుకొంటారా అంటూ మంత్రి విసుక్కొంటూ కారు ఎక్కి వెళ్లిపోయారు. మంత్రి తీరుని నిరసిస్తూ బీజేపీ నేతలు ఆందోళనకు దిగడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. కలుషిత నీటి సరఫరా, అధ్వాన్న పారిశుధ్యం గురించి తాము ముందే హెచ్చరించినా నగరపాలకులు పెడచెవిన పెట్టారని బీజేపీ గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి వల్లూరు జయప్రకాష్‌నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ మాట్లాడుతూ నగరంలో కలుషిత తాగునీరు వస్తుంటే వలంటీర్లు, సచివాలయాల సెక్రటరీలు ఏం చేస్తున్నారని ఆగ్రహించారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

డయేరియా లక్షణాలతో ఎక్కువమంది రోగులు చికిత్స కోసం జీజీహెచ్‌కి వస్తున్నందున వైద్యాధికారులు అప్రమతంగా ఉండాలని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శనివారం రాత్రి ఆయన జీజీహెచ్‌ని సందర్శించి అక్కడి వైద్యులతో మాట్లాడారు. రోగులు కోలుకొని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే వరకు మెరుగైన చికిత్సలు అందించాలన్నారు. వాంతులు, విరోచనాలతో ఆసుపత్రిలో చేరిన రోగులు నివసించే ప్రాంతాల్లో వాటర్ శాంపిల్స్ టెస్టు చేయించాలని, టెస్టు రిపోర్ట్ అందేవరకు ట్యాంకర్లతో మంచి నీటిని సరఫరా చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్‌కు సూచించారు. మెడికల్ అండ్ హెల్త్ టీములు ప్రభావిత కాలనీలలో ఇంటింటికి వెళ్ళి అసెస్ చేయాలన్నారు. వాంతులు, విరోచనాలతో ఎవరైనా ఇబ్బంది పడుతుంటే వారు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము నెంబర్ 6300115327కు ఫోన్ చేసి తక్షణ సాయం పొందవచ్చని తెలిపారు. వాంతులు, విరేచనాలతో 21 మంది జీజీహెచ్‌లో అడ్మిట్ అయ్యారని, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ తెలిపారు.


జీజీహెచ్‌లో బెడ్స్ ఖాళీ లేక రోగుల అవస్థలు

డయేరియా బాధితులతో జీజీహెచ్ క్యాజువాలిటీలో పడకల కొరత ఏర్పడింది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాంతులు, విరేచనాలతో వస్తున్న రోగులకు వార్డుల్లో ఖాళీ లేకపోవడంతో బల్లల మీదనే కూర్చోబెట్టి సెలైన్లు ఎక్కిస్తున్నారు.

స్వగ్రామానికి పెమ్మసాని

- జిల్లాలో అడుగుపెట్టిన చంద్రశేఖర్
- శనివారం రాత్రి స్వగ్రామమైన బుర్రిపాలెం చేరిక
- అధికారికంగా ప్రకటించాకే గుంటూరుకి రాక
- ఇప్పటికే అతని కార్యాలయం కోసం అద్దె భవనం సిద్ధం





బుర్రిపాలెంలో పెమ్మసాని నివాసం

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థిగా ఇప్పటికే ఖరారైనట్లు ప్రచారం జరుగుతున్న ఎన్ఆర్ఐ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం రాత్రి గుంటూరు జిల్లాలో అడుగుపెట్టారు. తెనాలి మండలంలోని ఆయన స్వగ్రామమైన బుర్రిపాలేనికి చేరుకున్నారు. అంతకు ముందు ఆయన గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లారు. అక్కడ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం స్వగ్రామమైన బుర్రిపాలెం చేరుకున్నారు. చాలాకాలం తరువాత సొంత గ్రామానికి వచ్చిన ఆయనకు గ్రామస్తులు ఎదురేగి స్వాగతం పలికారు. పెమ్మసానితో పాటు అతని తల్లి స్వరాజ్యమ్మ కూడా బుర్రిపాలేనికి వచ్చారు. పూర్వం నుంచి ఆ గ్రామంలో ఉన్న సొంత ఇల్లును వీరి రాక కోసం ముస్తాబు చేశారు. గుంటూరు ఎంపీ అభ్యర్థిగా తన పేరును అధికారికంగా ప్రకటించే వరకు బుర్రిపాలెంలోనే ఆయన మకాం వేయనున్నారు. ప్రకటించిన తరువాత గుంటూరు నగరానికి రానున్నారు. ఇప్పటికే ఆయన కార్యాలయం కోసం బృందావన్‌గార్డెన్స్‌లోని ఓ భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. ఇదే భవనాన్ని సిట్టింగ్ ఎంపీ గల్లా జయదేవ్ తొలినాళ్ళలో కొన్నాళ్ళు అద్దెకు తీసుకొని కార్యాలయం నిర్వహించారు. ఆ తరువాత సొంత భవనం సమకూర్చుకొని అక్కడికి తన కార్యాలయాన్ని జయదేవ్ మార్చుకున్నారు. పెమ్మసాని తన కార్యాలయంలో పనిచేసేందుకు సహాయకులను కూడా నియమించుకున్నారు. 2014 ఎన్నికలకు ముందే టీడీపీలో చేరినందున తిరిగి పార్టీలో చేరాల్సిన అవసరం లేదనే భావనలో ఆయన ఉన్నట్లు సమాచారం. అప్పటి నుంచి అమెరికాలో ఉంటున్నప్పటికీ టీడీపీ అభిమానిగానే ఆయన కొనసాగుతున్నారు. కాగా ఆదివారం బుర్రిపాలెంలో సూపర్‌స్టార్ కృష్ణ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో జరిగే సంస్మరణ వేడుకల్లో చంద్రశేఖర్ పాల్గొననున్నారు.

తిరునాళ్ల ఏర్పాట్లు ఊసేదీ?

- కోటప్పకొండ తిరునాళ్ళ ఏర్పాట్ల మాటెత్తని యంత్రాంగం
- 25 రోజుల్లో త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ళ మహోత్సవాలు
- రాష్ట్ర పండుగ హోదా కల్పించినా నిధులు విడుదల కాని వైనం



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) కోటప్ప కొండ తిరునాళ్ళ గడువు సమీపిస్తోంది. అయినా సంబంధిత శాఖ లు ఏఏ ఏర్పాట్లు చేయాలనే అంశంపై స్పష్టత రాలేదు. పోలీసు, దేవాదాయ, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, అగ్నిమాపక, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్యం, అటవీ, రెవెన్యూ తదితర శాఖలు తిరు నాళ్ళ ఏర్పాట్లలో కీలక పాత్ర పోషిం చాల్సి ఉంది. తాగు నీరు, పారిశుధ్యం, యాత్రికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. కొండ దిగువన, కొండ ఎగువన కోటయ్య స్వామి సన్నిధిన విస్తృత ఏర్పాట్లు చేయాలి. లక్షలాది మంది భక్తులు సులువుగా స్వామివారిని దర్శించు కొనేందుకు క్యూలైన్‌లు ఏర్పాటు చేయాలి. కొండకు వేలాది వాహనాలు తరలివస్తాయి. నరసరావుపేట, చిలకలూరిపేట, పెట్లూరివారిపాలెం, అవిశాయపాలెం రహదా రుల్లో వాహనాల రాకపోకలు ఉంటాయి. ఈ రహదారులకు అవ సరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలి. ఏటా తిరునాళ్ళ సందర్భంగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీనికి శాశ్వత పరిష్కారం చూపటంలో అధికారులు విఫల మవుతున్నారు.

పొంచి ఉన్న నీటిగండం..

తిరునాళ్ళకు తరలివచ్చే యాత్రికుల కోసం తాగునీటి వసతి కల్పించాలి. ఈ దిశగా ఇప్పటినుంచే చర్యలు చేపట్టాల్సి ఉండగా ఇందుకు జరుగుతున్న ప్రయత్నాలు లేవు. ఈ ఏడాది నీటిగండం పొంచి ఉంది. ఏటా చిలకలూరిపేట మేజర్‌కు సాగర్ నీటిని సరఫరా చేస్తారు. ఈ ఏడాది ఆ పరిస్థితులు కానరావడంలేదు. జలాశయాల్లో నీటినిల్వలు నిండుకోవడంతో కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే సాగర్ నుంచి నీటివిడుదల చేస్తున్నారు. డ్యాంల నిర్వహణ కేఆర్ఎంబీ చేతుల్లో ఉంది. సాగర్ నుంచి తిరునాళ్ల కోసం నీటిని విడుదల చేయాలంటే ఖచ్చితంగా రివర్ బోర్డు అనుమతి తీసుకోవాల్సిందే. తాగు నీటి అవసరాలకు నీటిని విడుదల చేసే షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటించారు. ఏప్రిల్ నెలలో తాగు నీటి అవసరాల కోసం సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తారు. తిరునాళ్ళకు నీటి కోసం కేఆర్ఎంబీ అనుమతి ముందుగానే తీసుకోవాల్సి ఉంది. ఈ అంశంలో సం బంధిత అధికారులు లేఖలు పంపాలి. ముందస్తు అనుమతి తీసుకోకుంటే తిరునాళ్ల జరిగే మార్చి 8 కల్లా నీరు వచ్చే పరిస్థితి ఉండదు. యంత్రాంగం వెను వెంటనే అప్రమత్తం కావాల్సి ఉంది.

ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన జగన్



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న రైతులు, మహిళలు

● 1516వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, ఫిబ్రవరి 10: ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిన నాయకుడు సీఎం జగన్‌రెడ్డి అని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. మూడు ముక్కల ఆటతో అభివృద్ధికి ఆటంకం కలిగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు శనివారం నాటికి 1516వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, సీఎం జగన్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలు నిలుపుదల చేయాలన్నారు. విశాఖ వెళతానని పదే పదే చెప్పే జగన్‌రెడ్డి ముందు అమరావతిని అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఏ మూలకైనా వెళ్లవచ్చని రైతులన్నారు. మూడు రాజధానులనేది జగన్‌రెడ్డి సొంత ప్రయోజనాల కోసమన్నారు. హైకోర్టు తీర్పును అమలు చేయమని చెపుతున్నా పెడచెవిన పెడుతున్నారన్నారు. రేపు కోర్టు ధిక్కార కేసును సీఎం జగన్‌రెడ్డి ఎదుర్కోవాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

టీడీపీ, జనసేన.. గెలుపు ఖాయం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు
● వెన్నాదేవిలో ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ
● హాజరైన యరపతినేని, కన్నా, చదలవాడ తదితరులు



వెన్నాదేవిలో ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కన్నా, యరపతినేని, జీవీ, చదలవాడ తదితరులు, సభలో మాట్లాడుతున్న కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. సత్తెనపల్లి మండలం వెన్నాదేవిలో టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని జీవీ ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ, గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, నరసరావుపేట ఇన్‌చార్జ్ చదలవాడ అరవిందబాబులు ఆవిష్కరించారు. పార్టీ పతాకాన్ని కన్నా లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. అనంతరం కన్నా అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో జీవీ మాట్లాడుతూ అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో దోపిడీకి, అరాచకానికి పాల్పడిందన్నారు. గోదావరి, పెన్నానది అనుసంధానం పనులను ప్రభుత్వం నిలిపి వేసిందన్నారు. దీనివల్ల ప్రకాశం పల్నాడు జిల్లాలో రైతాంగానికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు దోచుకోవటం తప్ప రైతాంగానికి చేసిన మేలు ఏమి లేదన్నారు. రానున్న ఎన్నికల్లో పల్నాడు జిల్లాలో ఏడు ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానాన్ని గెలుచు కోవటం ఖాయమన్నారు. యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ అహంకారంతో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లపై విమర్శలు చేసిన వైసీపీ నేతలు రెండు నెలల తరువాత భారీ మూల్యం చెల్లించు కోక తప్పదన్నారు. సైకో పాలనలో రాష్ట్రం 20 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందన్నారు. రాష్ట్రాన్ని రాజధాని లేని రాష్ట్రంగా తయారు చేశారన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో ఆంబోతు అంబటి రాంబాబును సాగనంపాలన్నారు. జనసేన, టీడీపీ కలయికతో రాష్ట్రంలో 155 స్థానాలతో ప్రభుత్వం ఏర్పాటు కావటం ఖాయమన్నారు. సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగుజాతికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించు కోవటం చాలా సంతోషం అన్నారు. ఎన్‌టీ రామారావు ముఖ్యమంత్రిగా చేసి రాష్ట్రంలో అన్ని వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసిన గ్రామ కమిటీ సభ్యులను కన్నా, యరపతినేని, జీవీ ఆంజనేయులు, చదలవాడ అరవిందబాబు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి కన్నా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బహిరంగ సభలో సింహాద్రి యాదవ్, ఆళ్ళ అమరేశ్వరరావు, భీమినేని వందనాదేవి, గొర్రెపాటి సుశీల, నార్నెపాటి వెంకటరావు, పచ్చ సుధీర్, ముంద్రా శ్రీనివాసరావు, వెనిగళ్ళ వేదాద్రి, మల్లేశ్వరి, వేణు, భార్గవ్, పల్లపాటి పెద్దిరాజు, బత్తుల నాగేశ్వరరావు, రావిపాటి మధుబాబు, ఆళ్ళ సాంబయ్య, తోటకూర సాంబశివరావు, పున్నారావు, సత్తెనపల్లి మండల, నియోజక వర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ హోంమంత్రి సుచరితకు నిరసన సెగ



సుచరిత కాన్వాయ్‌ను చుట్టుముట్టిన తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నేతలు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 10: రాష్ట్ర మాజీ హోంమంత్రి మేకతోటి సుచరితకు గుంటూరు జిల్లా మంగళగిరిలో నిరసన సెగ తగిలింది. దగా డీఎస్సీ వద్దు.. మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం మంగళగిరి అంబేద్కర్ సెంటరులో నిరసన, మానవహారం జరుగుతున్న సమయంలో సుచరిత కాన్వాయ్ అటుగా వచ్చింది. దీంతో నిరసన తెలుపుతున్న యువకులు కాన్వాయ్‌ను చుట్టుముట్టి ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. వారిని నిలువరించే క్రమంలో పోలీసులకు, యువతకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. కారును ముందుకు పోనివ్వడంతో ఓ పోలీసు కిందపడిపోయారు. కాన్వాయ్‌లోని కార్లు వేగంగా వెళ్లే క్రమంలో ఓ కారు మరో కారును ఢీకొట్టింది. ఎట్టకేలకు పోలీసులు యువతను పక్కకుతప్పించి కాన్వాయ్‌కు లైన్‌క్లియర్ చేసి ముందుకు పంపించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

మంగళగిరి, ఫిబ్రవరి 10: దేశంలోని 18 రాష్ట్రాలలో ఎస్సీలుగా వున్న రజకులను ఏపీలో కూడా ఎస్సీలుగా గుర్తించాలని నేషనల్ ధోబీ మహాసంఘ్ జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. తిరుమల శ్రీవారి పాదాల నుంచి బెజవాడ కనకదుర్గమ్మ ఆలయం వరకు ఆయన ప్రారంభించిన పాదయాత్ర శనివారం మంగళగిరి పట్టణానికి చేరుకుంది. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో చినకాకాని నేతన్న సర్కిల్ వద్ద పాదయాత్రకు ఘనస్వాగతం పలికారు. ఎస్సీ, బీసీ సంఘాల నాయకులు పాల్గొని పాదయాత్రకు సంఘీబావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు పేరూరి సత్యనారాయణ, వివిధ సంఘాల ప్రతినిధులు కట్టెపోగు ఉదయభాస్కర్, కొల్లూరు హనుమంతరావు, వుడతా శ్రీనివాసరావు, కాగితాల స్వాతి, తిరువీధుల కిరణ్, మంద్రు సత్యనారాయణ, దామర్ల నారాయణ, గొడ్డెలగల జయలక్ష్మీ, కొమ్మాకుల విజయభాస్కర్, కామరాజుగడ్డ సోమేశ్వరరావు, చాటపర్తి పోసిబాబు, వేముల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కొండవీడు ఉత్సవాలు



కొండవీడులో బెలూన్‌లు ఎగుర వేస్తున్న జాయింట్ కలెక్టర్

యడ్లపాడు, ఫిబ్రవరి 10: మండలంలోని కొండవీడు ఫెస్ట్ - 2024 ఉత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులతో కలసి జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాదు, అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ, డీఎఫ్‌వో ఎస్.రామచంద్రరరావులు బెలూన్‌లు ఎగర వేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. కాగా కొండవీడు కోట పర్యాటక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న కొండవీడు ఫెస్ట్ హెలిరైడ్‌క టిక్కెట్ ధర పెద్ద వారికి రూ.3,800, పిల్లలకు రూ.3,500గా నిర్ణయించినట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కొండవీడు ఫెస్ట్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భవనం పైనుంచి దూకి విద్యార్థి బలవన్మరణం



విద్యార్థి వంశీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రమేష్

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 10: ఎంటీఎంసీ పరిధిలోని ఓ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి శనివారం హాస్టల్ భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన బి.వంశీ సాయికృష్ణ సదరు యూనివర్సిటీలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. మధ్యాహ్న సమయంలో తాను ఉంటున్న హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో వివరాలు తెలియరాలేదు. తాడేపల్లి సీఐ మధుసూదనరావు, ఎస్ఐ రమేష్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, విద్యార్థి తండ్రి పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ ప్రభుత్వం రైతులను నిలువునా ముంచింది

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు



రైతులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు

చుండూరు, ఫిబ్రవరి 10: రైతుల కష్టాల ముందు వారికి ఎంత చేసినా తక్కువే.. అలాంటిది జగన్ ప్రభుత్వం నమ్ముకున్న రైతులను నిలువునా ముంచిందని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఆరోపించారు. శనివారం సాయంత్రం మోదుకూరులో జరిగిన రైతు, పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ పంట రుణాలపై సున్నా వడ్డీ, పంటల బీమా, తుఫాన్ నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా ఇలా రైతు పథకాల క్రింద వేల కోట్ల రూపాయల బకాయిలు అందించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జగన్ వాటి ఊసే ఎత్తడం లేదని తెలిపారు. గతంలో తెలుగుదేశం పాలనలో లక్ష రూపాయల లోపు పంట రుణాలకు వడ్డీ కట్టే అవసరమే ఉండేది కాదు. జగన్ వచ్చిన తరువాత అణా పైసలతో సహా పంట రుణాలపై అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారన్నారు. కేంద్రం అందించిన మిచౌంగ్ తుఫాన్ రూ.493కోట్లు నష్టపరిహారాన్ని కూడా పంపిణీ చేయలేదన్నారు. అదేవిధంగా 2021నుంచి 2023వరకు ఖరీఫ్, రబీ కాలాలకు సంబంధించిన రైతులకు వడ్డీ రాయితీని కూడా ఇంతవరకు జమ కాలేదు. గత నాలుగున్నర సంవత్సరాల్లో పంట కాల్వల మరమ్మత్తులకు ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గూడేటి ఎల్లారెడ్డి, కుర్రి వెంకటరెడ్డి, ఆళ్ళ సుబ్బారెడ్డి, కొల్లి శ్రీనివాసరెడ్డి, కంఠంనేని రాహుల్, రాఘవరెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థుల ప్రతిభ



హిమబిందు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి10: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు అధికసంఖ్యలో ఉత్తీర్ణత సాధించారని మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. మాస్టర్ మైండ్స్ విద్యార్థిని ఎ.హిమబిందు(హాల్ టికెట్ నెం: 887474) 400 మార్కులకు గాను 347 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు మోహన్ తెలిపారు. అలాగే తమ విద్యాసంస్థలో 400కు గాను 300, ఆపైన సాధించిన 36 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. అలాగే దాదాపు 1000 మంది మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వివరించారు. మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థ అత్యున్నత బోధనా విధానం, క్రమశిక్షణ విద్యార్థుల విజయానికి కారణమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మోహన్ అభినందించారు.

పీవీకి భారతరత్న.. అభినందనీయం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 10: మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించటం అభినందనీయమని సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీవీ నరసింహారావు సంస్కరణల రూపశిల్పి అన్నారు. పలు హోదాల్లో దేశానికి అసమాన సేవలు అందించారన్నారు. అనేక సంవత్సరాల పాటు లోక్‌సభ, శాసనసభ్యునిగా ఆయన చేసిన సేవలు మరువులేనివన్నారు. దేశ ఆర్థికాభి వృద్ధిలో దూరదృష్టితో కూడిన ఆయన నాయకత్వం అతి కీలకపాత్ర పోషించిం దన్నారు. దేశ శ్రేయస్సుకు, అభివృద్ధికి బలమైన పునాది వేసిందన్నారు. ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ఆయన అందించిన సేవలు మరువ లేనివని ఆయన పేర్కొన్నారు. పీవీకి భారతరత్న ప్రకటించడంపై ప్రధాని నరేంద్రమోదీకి కూడా కన్నా అభినందనలు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	136, 147,156
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

ప్రధాన రహదారిపై చెక్కుల పంపిణీ

● బందోబస్తు నిర్వహించిన పోలీసులు



స్థానిక రథం సెంటర్‌లో రోడ్డుపై టెంట్లు వేయడంతో ఇబ్బందులు పడిన ద్విచక్రవాహన చోదకులు, ప్రజలు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 10: అడుగడుగునా వైసీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నప్పటికీ అధికారులు, పోలీసులు చోద్యం చూస్తున్నారు. డ్వాక్రా సంఘాలకు ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం స్థానిక రథం సెంటర్‌లో శనివారం నిర్వహించారు. డ్వాక్రా సంఘాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం భట్టిప్రోలు గ్రామం నడిబొడ్డున మెయిన్‌రోడ్డుపై నిర్వహించారు. ద్విచక్రవాహన చోదకులు, పాదచారులు, వ్యాపారవర్గాలు, స్థానిక గృహాల్లో నివాసం ఉండే ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా ఎన్నిక కాకుండానే అధికారిక కార్యక్రమాల్లో నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు ఎలా పాల్గొంటారని పలువురు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమానికి నాలుగు రోడ్లలో పోలీసులు దగ్గర ఉండి మరీ ట్రాఫిక్‌ను మళ్ళించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పోలీసు వాహనాలతో బందోబస్తుగా సభాస్థలికి సమన్వయకర్త అశోక్‌బాబు కాన్వాయ్‌ను తీసుకురావడంపై రాజకీయ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికార దుర్వినియోగం జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కమ్మజన సేవాసమితికి రూ.5 లక్షల విరాళం



గోరంట్ల పున్నయ్యచౌదరికి చెక్కును అందజేస్తున్న డాక్టర్ బి.శారదాదేవి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 10: జేకేసీ రోడ్డులోని కమ్మజన సేవాసమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయంలో ఒకగది నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తం రూ.5 లక్షలను విరాళంగా నగరానికి చెందిన డాక్టర్ బి.శారదాదేవి ప్రకటించారు. ఈ సందర్భంగా శనివారం కమ్మజన సేవా సమితి కోశాధికారి గోరంట్ల పున్నయ్య చౌదరికి ఆమె చెక్కును అందజేశారు. అనంతరం శారదాదేవి మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు భైరవనేని వెంకటేశ్వరరావు, నాగేశ్వరమ్మల గౌరవార్థం ఈ విరాళాన్ని అందజేసినట్లు వివరించారు. దాదాపు 1,600 మంది బాలికలకు వసతి కల్పిస్తున్న సేవా సమితి సేవలు అభినందనీయమన్నారు. సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ కేజేఎస్ఎస్ 80జీ, 12ఏఏ, సీఎస్ఎస్ సర్టిఫికెట్లు కలిగి ఉన్నాయని, దాతలు ఇచ్చిన విరాళాలను పారదర్శకంగా వినియోగి స్తామని వివరించారు. త్వరలోనే భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోవెలమూడి రవీంద్ర

జగన్‌రెడ్డి అరాచకాలపై లోకేశ్ శంఖారావం

● గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జగన్మోహన్ రెడ్డి అరాచకపాలనపై టీడీపీ యువనేత నారా లోకేశ్ శంఖారావం పూరించడానికి సిద్ధమయ్యారని టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర (నాని) అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యువగళం పాదయాత్ర ద్వారా నారా లోకేశ్ జగన్ రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలను ప్రజలకు తెలియజేశారన్నారు. ఇప్పుడు 'శంఖారావం' ద్వారా అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళతారన్నారు. నిరుద్యోగంతో యువత ఇబ్బందులు పడుతుంటే, ధరల పెరుగుదలతో సామాన్యులు చితికిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సుఖవాసి శ్రీనివాసరావు, ఈరంటి వర ప్రసాద్ బాబు, ఉప్పుటూరి పేరయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలిపింది ఎన్టీఆర్ : రవీంద్ర

తెలుగుప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది అన్న ఎన్టీఆర్ అని కోవెలమూడి రవీంద్ర అన్నారు. నగరంలోని 39వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి మీ రాబీ, రుస్తుంబాబుల ఆధ్వర్యంలో గుజ్జనగుండ్లలోని కరెంటు ఆఫీస్ రోడ్డువద్ద ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని శనివారం రవీంద్ర ఆవిష్కరించారు. అలాగే జేకేసీ కాలేజీ రోడ్డులో 39, 42 డివిజన్ల క్లస్టర్ ఇన్‌చార్జి కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమాల్లో నిమ్మల శేషయ్య, ఎస్. వీరయ్య, ఉదయ్, వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్, రుస్తుంబాబు, మానం శ్రీనివాస్, పద్మశ్రీ, రాజేశ్, కసుకుర్తి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వైసీపీ

● రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి ఇలాకలోనే డయేరియా..
● మృతుల కుటుంబాలకు, బాధితులకు పరిహారం ఇవ్వాలి
● టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్



గుంటూరు, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వైసీపీ నేతలు తక్షణమే వారి పదవులకు రాజీనామా చెయ్యాలని టీడీపీ గుంటూరునగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ డిమాండ్ చేశారు. నగరంలో కలుషిత నీరు తాగి డయేరియాతో పద్మ అనే బాలిక మృతిచెందటం బాధాకరమన్నారు. మూడు రోజుల క్రితం సంగడిగుంటకు చెందిన కొర్రపాటి ఓబులు డయేరియాతో మృతి చెందార న్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి, మేయర్ నగరంలోనే ఉంటున్నా ప్రజల ప్రాణాలకు రక్షణ కరవైందని ఆవేదన వ్యక్తంచేశారు. వారం రోజులుగా కలుషిత తాగునీరు కలకలం సృష్టిస్తుంటే ప్రజా ప్రతినిధులు, అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వారి నిర్లక్ష్యంతోనే డయేరియాతో ప్రజలు మృతి చెందుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. డయేరియా మృతులకు కుటుంబాలకు, బాధితులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని, బాధితులకు మెరుగైనవైద్యం అదించాలని డిమాండ్ చేశారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీ- జనసేన ప్రభంజనమే

● టీడీపీ పశ్చిమ నియోజకవర్గ బీసీ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నిమ్మల శేషయ్య

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో టీడీపీ- జనసేన కూటమి ప్రభంజనం సృష్టించబోతుందని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ సీనియర్ బీసీనేత డాక్టర్ నిమ్మల శేషయ్య అన్నారు. గుజ్జనగుండ్ల కరెంటు ఎదురుగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జగన్‌ను ఇంటికి పంపాలని ఇప్పటికే ప్రజలు నిర్ణయించుకున్న విషయమే ఇండియాటుడే సర్వేలో మరో సారి తేటతెల్లమైందన్నారు. ఒకవైపు విధ్వంసం, మరోవైపు అరాచకం తప్ప పాలన తెలియని జగన్ రాష్ట్రాన్ని అన్నివిధాల నాశనం చేశారని, అభివృద్ధిలో పాతాళానికి పడేసి, ధరల మంటలో దేశంలో నెంబర్ 1 స్థానంలో నిలిపారని మండిపడ్డారు. అయిదేళ్ల జగన్ పాలన ఎలా ఉందో షాక్ కొడుతున్న కరెంటు బిల్లు, మంట పుట్టిస్తున్న పెట్రోల్, డీజిల్ ధరలు, వాతలు తేలేలా చేస్తున్న మునిసిపల్ పన్నులు, రిజిస్ట్రేషన్ చార్జీలే తార్కాణమన్నారు.

ముస్లిం ఇస్తిమాకు నసీర్ సహకారం

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా నంబూరులో జరుగుతున్న తబ్లీక్ ఇస్తిమాకు విచ్చేసిన రాష్ట్ర వ్యాప్త ముస్లిం సోదరులను స్వాగతం పలుకుతూ గుంటూరు తూర్పు టీడీపీ ఇన్‌చార్జి మహమ్మద్ నసీర్ పెద్ద ఎత్తున ఏర్పాట్లనుచేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారితోపాటు, గుంటూరు బస్టాండ్ వద్ద నుంచి విచ్చేసిన ముస్లింల సౌకర్యం కోసం 30 టాటా మ్యాజిక్‌లను, వేరే జిల్లాల నుంచి రైళ్లలో వచ్చిన యాత్రికుల కోసం లారీలు ఏర్పాటుచేసి రాకపోకలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించారు.




అంకమ్మరావును సత్కరిస్తున్న రాయపాటి శ్రీనివాస్, కల్లూరి జయప్రకాష్ తదితరులు

డాక్టర్ కాసరనేని సదాశివరావు కళాసమితి

నాటకోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి10: స్థానిక బృందావన గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కేఆర్‌కే ఈవెంట్స్ నిర్వహణలో డాక్టర్ కాసరనేని సదాశివరావు కళాసమితి 11 వసంతాల కళారంగ ప్రస్థానం సందర్భంగా 12వ నాటకోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో భాగంగా తొలిరోజు రంగ స్థల నటుడు, దర్శకుడు కావూరి సత్యనారాయణ అధ్యక్షత జరిగిన సభలో అతిథులుగా విద్యావేత్త పాతూరి కోటేశ్వరరావు, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటి అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్మికశాఖ చైర్మన్ వల్లూరి జయ ప్రకాశ్ నారాయణ, పోలిమెట్ల గోపిచంద్, డాక్టర్ కాసరనేని శ్రీవల్లిరాణి, డాక్టర్ పాతూరి ఉషాబాల, ఆలయ కమిటి సహాయ కార్యదర్శులు పాల్గొని డాక్టర్ సదాశివరావు వైద్యరంగానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సంస్థ కన్వీనర్ ముప్పా అంకమ్మరావును ఘనంగా సత్కరించారు. సభానంతరం సిరిమువ్వ కల్చరల్ అసోషియేషన్, హైదరాబాద్ వారు అడారి సోమశేఖర్ రచనకు మంజునాథ్ దర్శకత్వం వహించిన 'హక్కు' నాటికను ప్రదర్శించారు.



మాట్లాడుతున్న యండ్రపాటి అశోక్ కుమార్

దళితుల హక్కుల కోసం పోరాడిన కనపర్తి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి10: దళిత సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన పోరాట యోధుడు కనపర్తి ఏసురత్నం అని సంస్మరణ సభ నిర్వాహణ కమిటీ సభ్యులు యండ్రపాటి అశోక్‌కుమార్ కొనియాడాడు. దళిత ఉద్యమ నేత కనపర్తి ఏసురత్నం సంస్మరణ సభ ఏసీ కాలేజీలోని జేడీ శీలం హాల్లో శనివారం నిర్వహించారు. అశోక్ కుమార్ మాట్లాడుతూ గొప్ప ధిక్కార స్వరంతో జర్మనీ, కెనడా, జనీవా, లండన్, దర్బన్, నెదర్లాండ్స్, ఆఫ్రికా, ఫ్రాన్స్ రోమ్, ఆస్ట్రేలియా, ఈజిప్టు, సింగపూర్, ఫిలిపైన్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై పేదల సమస్యల పరిష్కారం కోసం గళమెత్తారన్నారు. దళిత, గిరిజనులపై జరుగుతున్న అకృత్యాలను ఖండిస్తూ అనునిత్యం పోరాడిన మహనీయుడు కనపర్తి అన్నారు. అనంతరం గుదిబండి. వేణుగోపాలరెడ్డి, పిల్లి వాసు, తురుమెళ్ల మోహనరావు, జీఆర్ భగత్‌సింగ్, డాక్టర్ ప్రత్యూష తదితరులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు వేము సమత ప్రపుల్లోపాధ్యాయ, నరేంద్ర సుధాకర్, చిన్నం డేవిడ్. విలియమ్స్, వీసా జ్ఞానరాజు, రాయపూడి మరియదాసు పాల్గొన్నారు.

డయేరియా మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత

● తాగునీటి కలుషితంపై వైసీపీ నేతలు, అధికారుల నిర్లక్ష్యం
● టీడీపీ గుంటూరు తూర్పు ఇన్‌చార్జి నసీర్
● బాధితులకు పరామర్శ.. నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్



కలుషిత నీరుతాగి మృతిచెందిన మహిళ మృతదేహం వద్ద నసీర్, కనపర్తి

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గతవారం రోజులుగా కలుషిత నీటిపై ఆందోళనచేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం, కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులే మరణాలకు బాధ్యులని టీడీపీ గుంటూరు తూర్పు ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ ఆరోపించారు. కలుషిత నీరు తాగి వివిధ ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు, మృతుల కుటుంబాలను శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత నీటి బాధితుల్లో కొంతమంది పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. ఈ ఘటనపై నగరపాల సంస్థ కమిషనర్‌ను వివరణ కోరగా ఆమె దాటవేశారన్నారు. కలుషిత నీరు సరఫరా జరుగుతోందని మూడు రోజుల క్రితమే తాను అధికారుల దృష్టికి తెచ్చానని, కానీ ఎవరూ పట్టించుకోలేదన్నారు. కలుషత నీరు తాగి డయేరియాతో సంభవించిన మరణాలు ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం బాధితులను ఆదుకొని, వారికి నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. బాధితులను పరామ ర్శించినవారిలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బాధితులకు వామపక్ష నాయకుల పరామర్శ

గుంటూరు(తూర్పు): నగరపాలక సంస్థలో సరఫరా చేస్తున్న తాగునీరు తాగి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను సీపీఐ, సీపీఎం నాయకులు జంగాల అజయ్‌కుమార్, కోట మాల్యాద్రి, కే.నళిని కాంత్, ఆకిటి అరుణ్ కుమార్, బందెల నాసర్‌జీలు పరామర్శించారు. ఈ సందర్భంగా జీజీహెచ్ నుంచి బయటకు వెళ్తున్న మేయర్ మనోహరనాయుడు వాహనాన్ని వామపక్ష పార్టీల నేతలు అడ్డుకున్నారు. అనంతరం కలుషిత నీరు తాగి మృతి చెందిన బాధితురాలి కుటుంబానికి నష్టపరిహారాన్ని చెల్లించాలని, అదేవిధంగా చికిత్స తీసుకుంటున్న 18 బాధితులకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని నాయకులు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు.



మేయర్ వాహనాన్ని అడ్డుకుని మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

డయేరియా మృతుల కుటుంబాలకు

రూ. 50 లక్షలు పరిహారం ఇవ్వాలి

● టీడీపీ గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర

స్థానిక సంగడిగుంట, శ్రీనగర్ తదితర ప్రాంతాల్లో కలుషిత నీరు తాగి, డయేరియా బారినపడి మృతిచెందిన వారి కుటుంబాల వారికి ప్రభుత్వం రూ.50 లక్షలు పరి హారం ఇవ్వాలని టీడీపీ గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర డిమాండ్ చేశారు. కలుషిత నీరు తాగి అనారోగ్యం బారినపడి చికిత్స కోసం జీజీహెచ్‌లో చేరిన 30 మంది బాధితులను శనివారం ఆయన పరామర్శించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను కలిసి బాధితుల ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుని, వారికి మెరుగయిన వైద్యం అందించాలనికోరారు. మృతుల కుటుంబాలతో పాటు అనారోగ్య బాధితులకూ పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న రవీంద్ర



చందన తేజస్వినిని అభినందిస్తున్న చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు తదితరులు

ఐస్ స్కేటింగ్ క్రీడాకారిణీ అద్భుత ప్రతిభ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి10: లడఖ్‌లో నిర్వహించిన జాతీయ ఖేల్ ఇండియా వింటర్ గేమ్స్‌లో నగరానికి చెందిన యర్రంశెట్టి దేవి చందన తేజస్వినిభాయ్ అండర్-17 ఐస్ స్కేటింగ్, మహిళ విభాగంలో 1000 మీటర్ల రేసులో వెండి పథకం సాధించి, రెండవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా శనివారం స్థానిక చంద్రమౌళినగర్ నాద్ వెల్‌నెస్ కార్యాలయంలో క్రీడాకారిణీ చందర తేజస్వినికి అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు, ఐస్ స్కేటింగ్ రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి ఖాజా పాల్గొని క్రీడాకారిణీని ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 150 మంది క్రీడాకారులు పాల్గొన్న ఆ పోటీల్లో దేవి చందన తేజస్విని భాయ్ 2వ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. అలాగే ఐస్‌స్కేటింగ్‌లో వివిధ విభాగాల్లో రాష్ట్రం 7వ స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు సలాం, నురుద్దిన్, నోడల్ అధికారి మహేష్, టీమ్ అఫీషియల్ అధికారి అబ్దుల్ హఫీజ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కల్పతారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

ఎంఈవో-1 పోస్టులను

ప్రభుత్వ ఉపాధ్యాయులతో భర్తీచేయాలి

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 10: ఖాళీగా ఉన్న ఎంఈవో -1పోస్టులు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో భర్తీచేయాలని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని శనివారం గుంటూరు వచ్చిన ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డికి ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం నేతలు వినతి పత్రం అందజేశారు. జిల్లాలో ఎంఈవో -1 పోస్టులను త్వరితగతిన ప్రభుత్వ యాజమాన్య ఉపాధ్యాయులచే భర్తీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగావున్న ఎంఈవో-2 పోస్టులు ఏర్పాటుచేసి జిల్లా పరిషత్ యాజమాన్య ఉపాధ్యాయులచే భర్తీచేసి పరిష్కారం చూపించామని, అలాగే ఎంఈవో-1 పోస్టులను ఉద్యోన్నతులు చేపట్టి ప్రభుత్వ ఉపాధ్యాయులచే భర్తీచేస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం నేతలు ప్రభాకర్ రెడ్డి, రమణయ్య, ఎం.డి. ఖాసీం, వసుంధర మరియు అబ్దుల్ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అప్రజాస్వామ్యం రాజ్యమేలుతోంది

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అప్రజాస్వామ్యం, అనైతికం రాజ్యమేలుతోందని టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ముఢావత్ శ్రీనునాయక్ ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వివక్షతో కూడిన నియంత పరిపాలనకు జగన్మోహన్ రెడ్డి తెరతీసారని, ఫలితంగా బడుగు బలహీన వర్గాల ప్రజలు అన్నివిధాలా ఎస్సీ, ఎస్టీలు వెనకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికార పార్టీ నాయకులే ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేస్తూ, వారిపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బనాయించటం వైసీపీ ప్రభుత్వ పాలనలోనే చూస్తున్నామన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పరిపాలనసాగించే నారా చంద్రబాబు నాయుడిని తిరిగి గెలిపించుకోవాలన్నారు. అందుకోసమే యువనేత లోకేశ్ ఎన్నికల సమర శంఖాన్ని పూరిస్తున్నారన్నారు. కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీలందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలి

● ఏఐకేఎమ్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల ప్రసాదు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి10: భూమిని కార్పొరేట్లకు దారాదత్తం చేసే ఆంధ్రప్రదేశ్ భూ హక్కుల చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎమ్ఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల ప్రసాదు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అరండల్ పేటలో కామ్రేడ్ మాదాల నారాయణ స్వామి భవనంలో సంఘ ఉమ్మడిజిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ల్యాండ్ టైటలింగ్ యాక్ట్, అలాగే జగన్ ప్రభుత్వం నూతనంగా తెచ్చిన అసైన్డ్ భూముల ఆర్డినెన్స్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, ఆదివాసీల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న అటవీహక్కుల సంరక్షణ నియమాలను వ్యతిరేకించాలని కోరుతూ నేటి నుంచి 15 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రాల్లో ధర్నాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో పోతురాజు, రెడ్డి శ్రీను, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ జాక్ క్లామకస్, వేదికపై లక్ష్మణరెడ్డి తదితరులు

దివ్యాంగులకు అండగా మానవతా సంస్థ

● కార్మెల్ సేవా సదన్ వ్యవస్థాపకులు డాక్టర్ జాక్ క్లామకస్

గుంటూరు / కార్పొరేషన్, ఫిబ్రవరి 10: దివ్యాంగులకు అండగా నిలుస్తున్న సంస్థ "మానవతా" అని ఆ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ జాక్ క్లమాకస్ తెలిపారు. గోరంట్ల వద్దనున్న సంస్థలో మానసిక వికలాంగుల ఆశ్రమంలో నిరాశ్రయలకు ఆశ్రయం కల్పించిన కార్మెల్ సేవా సదన్‌కు మానవత సంస్థ ఆధ్వర్యంలో ప్రహరీ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా కీర్తన సంస్థ అధినేత పద్మాజారెడ్డి రూ.లక్ష విరాళాన్ని అందించారు. డాక్టర్ జాక్ క్లామకస్ మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా గుంటూరు నగరంలోని గోరంట్ల వద్ద గల కార్మెల్ సేవా సదన్, దివ్యాంగుల ఆశ్రమంలో దాదాపు 70 మంది నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించిన కార్మల్ సేవాసదన్ సంస్థను ఆదుకోవడానికి మానవత స్వచ్ఛంద సంస్థ శ్రీకారం చుట్టింది అని అన్నారు. చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ ప్రహరీ నిర్మాణానికి ముందుకు వచ్చిన శర్వాణి రెడీమిక్స్ అధినేత పెద్దిరెడ్డి గోపాల్ రెడ్డిని అభినందించారు. దాతల సహకారంతో నగరంలోని ప్రభుత్వ హాస్టళ్లలో వసతులు, సదుపాయాల కల్పనకు కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ గోలిలక్ష్మయ్య, రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ బీ.కృష్ణవేణి, మానవతా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, రుద్ర ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు మహబూబ్ సుభాని, అల్లాబక్షు, ముజీబ్, విమలకుమారి తదితరులున్నారు.

ప్రజలు శాస్త్రీయ దృక్పథం పెంచుకోవాలి

● జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళీధర్

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 10: ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంచడమే కళాజాత లక్ష్యమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు జి మురళీధర్ తెలిపారు. స్థానిక స్వర్ణభారత్‌నగర్ సమీపంలోని ఎంవీఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ స్కూల్లో మూఢ నమ్మకాలు, పర్యావరణ పరిరక్షణ, మద్యపాన నిషేదం, లింగ సమానత్వం తదితర అంశాలపై జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు ఈ కళాజాత సాగుతుందని తెలిపారు. తమ కళా ప్రదర్శనలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి బీ.ప్రసాద్, టీ. జాన్‌బాబు, టీఆర్ రమేష్, చాందిన, ఎస్‌కే అహ్మద్ హుస్సేన్, ఎన్.తాండవకృష్ణ, ఎల్.భార్గవి, ఈ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టం రాజ్యాంగ విరుద్ధం

● సీనియర్ న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు



మాట్లాడుతున్న న్యాయవాది రవీంద్రబాబు తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 10: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టం-2023 జాతీయ చట్టాలకు, రాజ్యాంగ విరుద్ధమైనదని సీనియర్ న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు తెలిపారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం జరిగిన చర్చావేదిక ఆయన ప్రసంగించారు. ఈ చట్టం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అనేక కష్టనష్టాలకు కారణమౌతుందని ఆందోళన వ్యక్తంచేశారు. భూ సంబంధిత స్థిరాస్తి వ్యవహారాలు, వివాదాలను సివిల్ కోర్టుల పరిధి నుంచి తప్పించి రెవెన్యూ అధికారులకు కట్టబెట్టటం ప్రజలను ఇక్కట్లు పాలు చేయటమేనని అన్నారు. ఈ చట్టంలోని అత్యంత ప్రధానమైన, ప్రమాదకరమైన నిబంధనలతో భూయాజమాన్య హక్కులకు భంగం వాటిల్లబోతుందన్నారు. ప్రజలందరూ వాస్తవాలు తెలుసుకొని ఈ చట్టం రద్దు కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కొండా శివరామిరెడ్డి, అవధానుల హరి, రాజారావు, రుక్మిణి, మల్లికార్జునరావు పాల్గొన్నారు.



సీఈవో ఎంకే మీనా నిర్వహించిన వీసీకి హాజరైన కలెక్టర్, జేసీ, కమిషనర్

ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయిలో సన్నద్ధం

● శరవేగంగా ఏర్పాట్ల పనులు.. సిబ్బందికి శిక్షణ
● సీఈవోకు నివేదించిన కలెక్టర్

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణ సన్నద్ధతకు సంబంధించి ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం అవసరమైన అన్ని చర్యలు పటిష్ట ప్రణాళికతో తీసుకుంటున్నామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి సీఈవో మీనా ఎన్నికల నిర్వహణ సన్నద్ధత ఏర్పాట్లు, ఓటరు క్లెయిమ్‌ల పరిష్కారం అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితాకు సంబంధించి అన్ని రకాల క్లెయిమ్‌లు నిర్దేశిత సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రింటింగ్ అయ్యి వచ్చిన ఎపిక్ కార్డులను పోస్టల్ డిపార్టుమెంట్ ద్వారా ఎప్పటికప్పుడు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక సౌకర్యాల పనులు సోమవారం నాటికి పూర్తి చేస్తామన్నారు. ఎన్నికల నిర్వహణ సన్నద్ధత ఏర్పాట్లుకు సంబంధించి పోలింగ్ సిబ్బందికి ఈవీఎం, ఇతర బృందాలు ఏర్పాటుకు అవసరమైన అధికారులు, ఉద్యోగులు వివరాలపై ప్రతి పాదనలు సిద్ధం చేశామన్నారు. జిల్లాలోని అన్ని నియోజక వర్గాలలోని పోలింగ్ కేంద్రాలకు రవాణ, ఆమోద ప్రణాళిక, రూట్ మ్యాప్ రూపొందించామని, అవసరమైన వాహనాల సిద్ధం చేశామన్నారు. భద్రత ఏర్పాట్లుకు సంబంధించి జిల్లా ఎస్పీని సమన్వయం చేసుకొని అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను ఫిబ్రవరి 28 నాటికి పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో సమస్యాత్మక, క్రిటికల్ పోలింగ్ బూత్‌లను గుర్తించటం జరిగిందని, వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫి, కమ్యూ నికేషన్, టెక్నాలజీ యూజ్ ప్లాన్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయటం జరిగిందని కలెక్టర్ నివేదించారు. సమావేశంలో సమావేశంలో జేసీ రాజకుమారి గణియా, కమిషనర్ కీర్తీ చేకూరి, జిల్లా రెవెన్యూ అధికారి పెద్దిరోజా, ఈఆర్వోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



శారద కాలనీలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మేయర్, కమిషనర్

తాగునీటి సరఫరాపై ఆందోళన వద్దు

● ఇంటింటా నీటి శాంపిల్స్ పరీక్షిస్తున్నాం : నగర మేయర్, కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి10: నగర ప్రజలు తాగునీటి సరఫరాపై ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, జీఎంసీ శుద్ధమైన తాగునీటిని అందించడంలో నిర్దేశిత నిబంధనల మేరకు అన్ని చర్యలు పక్కాగా తీసుకుంటుందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. శనివారం శారదాకాలనీ, శ్రీనగర్ ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్యానికి గురయ్యారని తెలిసిన వెంటనే నగర మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనారోగ్యకారణాలను అడిగి తెలుసుకున్నారు. శారదకాలని వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రంలో, ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న 19 మంది బాదితులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మూడు రోజుల క్రితం సంగడిగుంట తిరుమలచారి కాలనిలో జరిగిన సంఘటనపై తక్షణం స్పందించి ఆయా ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అధికారులు ప్రతి ఇంటి నుంచి తాగునీటిని సేకరించి ప్రభుత్వ వైద్య కళాశాలలోని రీజినల్ ల్యాబ్ వారిచే పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. తాగునీటిలో క్లోరిన్ కూడా తగుపాలల్లోనే ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. ప్రజారోగ్య అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటి ఆరోగ్య సర్వే చేయడం జరిగిందని, అందులో ఎవ్వరికీ డయేరియా ప్రభావం లేదన్న రిపోర్ట్ వచ్చిందని తెలిపారు. శనివారం మృతి చెందిన శారదాకాలనికి చెందిన పద్మ (18 ఏళ్లు) డయేరియాతో మృతి చెందలేదని తెలిసిందని ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. అయినప్పటికీ పోస్ట్‌మార్టం చేపట్టాలని ఆదేశించామన్నారు. శారదాకాలని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక మెడికల్ క్యాంప్ చేశామని, ఎవరికైనా అనారోగ్య లక్షణాలు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ అధికారులు నగరంలోని ప్రతి రిజర్వాయర్ పరిధిలో తాగునీటిని సరఫరా జరిగే సమయంలో ఎమినిటి కార్యదర్శుల ద్వారా ఫస్ట్ పాయింట్ నుంచి టేయిలేండ్ వరకు క్లోరిన్ శ్యాంపిల్స్ సేకరించాలని ఆదేశించామన్నారు. శారదాకాలనీ రిజర్వాయర్ షెడ్యూల్ మేరకు జనవరి 20న క్లీన్ చేయడం జరిగిందని, నగరంలోని అన్ని రిజర్వాయర్లు కూడా నిర్దేశిత గడువు మేరకు క్లీన్ చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా అధికారుల నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుర్తుతెలియని మహిళ దారుణ హత్య

● ఏటుకూరు శివారు రియల్ ఎస్టేట్ వెంచర్‌లో మృతదేహం

గుంటూరు, ఫిబ్రవరి 10 : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటుకూరు శివారు లాల్‌పురం వెళ్లే డొంకలోగల రియల్ ఎస్టేట్ వెంచర్‌లో గుర్తుతెలియని ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. శనివారం మధ్యాహ్నం ఈహత్య జరిగి ఉంటుందని భావిస్తున్నారు. సాయంత్రం సుమారు నాలుగున్నర గంటల సమయంలో రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ప్లాట్ల కోసం వచ్చిన వారు మహిళ మృతదేహాన్ని గమనించి 100 నంబరుకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న నల్లపాడు సీఐ రాంబాబు, ఎస్ఐ అశోక్, సిబ్బంది ఘటనా స్థలాన్ని సందర్శించారు. సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన గుర్తు తెలియని మహిళను రాయితో తల, మెడ, ముఖం భాగంలో కొట్టి చంపారు. హత్యకు ఉపయోగించిన రాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హతురాలి కుడి చేతిపై దుర్గ అని ఇంగ్లీష్ అక్షరాలతో రాసి ఉంది. ఆమె ఒంటిపై పంజాబీ డ్రెస్ టాప్ ఎరుపు రంగు, ప్యాంట్ బ్లూ రంగు డ్రస్ ధరించి ఉంది. హతురాలి వివరాలు తెలిసిన వారు నల్లపాడు పోలీసులకు 8688831376, 8688831378, 8688831605 నంబర్లలో సమాచారం ఇవ్వవచ్చని పోలీసులు కోరారు. హతురాలు గుర్తింపు అనంతరం హత్యకు దారితీసిన కారణాలు తెలుస్తుందని పోలీసులు తెలిపారు.

అన్నిదానాల్లో కెల్లా

రక్తదానం మిన్న

గుంటూరు, ఫిబ్రవరి 10: అన్ని దానాల్లో కెల్లా రక్తదానం ఎంతో ప్రాణదానంతో సమానమని నెల్లూరు జోన్ ఈడి ఆదంసాహెబ్ తెలిపారు. 35వ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ బస్టాండ్‌లో జీజీహెచ్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన కార్యక్రమం జరిగింది. ఆదం సాహెబ్ మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రజారవాణాధికారి ఎం రవికాంత్‌మాట్లాడుతూ రక్త దానంపై ఉన్న అపోహలను వీడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ సురేష్, డాక్టర్ సీహెచ్ విజయలక్ష్మీ, డీఎం రామ కృష్ణ, అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

నోటీసు

In the Court of The III Addl. Dist. Judege. Guntur

EP.No. 7/2023, IN OS NO. 20/2017

Between :

చల్లా వెంకట్రావు ...DHR

AND

మునగాల నరిసిరెడ్డి ...JDR

To.

మునగాల నరిసిరెడ్డి S/o. అంజిరెడ్డి, D.No. 4-14-93, అంజనేయుపేట, కొరిటెపాడు, గుంటూరు సిటీ, ఆంధ్రప్రదేశ్

పై నెంబర్ ఇ.పి.లో జె.డి.ఆర్. అయిన మీకు నోటీసు నిమిత్తం పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియజేయమని కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు 20-2-2024న ఉ॥గం॥ 10:30ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొనవలసినది లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేదీ : 20-2-2024

వి. తిరుమలరావు, అడ్వకేట్, గుంటూరు

దిక్సూచి DIKSUCHI

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

నీటి పారుదల

పంటలకు కృత్రిమంగా నీటి వసతిని కల్పించడాన్నే నీటి పారుదల అంటారు. 1950-1951లో నీటి పారుదల వసతులు 22.6 మిలియన్ హెక్టార్లకు కల్పించగా... ప్రస్తుతం 139.89 మిలియన్ హెక్టార్లకు నీటి సౌకర్యం ఉంది.

భారతదేశంలో నీటి పారుదల ప్రధానంగా మూడు మార్గాలపై ఆధారపడి ఉంది. అవి.. బావులు, కాలువలు, చెరువులు.

బావులు: భారతదేశంలో అత్యధికంగా(62 శాతం) నీటి పారుదల బావుల ద్వారానే కల్పిస్తున్నారు. విస్తీర్ణపరంగా ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, శాతం పరంగా గుజరాత్‌లో అధికంగా నీటి పారుదల వసతులున్నాయి. బావులు రెండు రకాలు... గొట్టపు బావులు, సాధారణ బావులు. ఉత్తరప్రదేశ్‌లో బావులు అత్యధికంగా ఉన్నాయి.

కాలువలు: భారతదేశంలో 24 శాతం నీటి పారుదల కాలువల ద్వారా సమకూరుతోంది. విస్తీర్ణపరంగా ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్; శాతంపరంగా పంజాబ్‌లో అధికంగా కాలువల ద్వారా నీటి పారుదల కల్పిస్తున్నారు.

చెరువులు: దేశంలో 3 శాతం నీటి పారుదలను చెరువుల ద్వారా కల్పిస్తున్నారు. విస్తీర్ణపరంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ; శాతం పరంగా తమిళనాడులో అధికంగా చెరువుల ద్వారా నీటి పారుదుల సౌకర్యం ఉంది. చెరువులు ప్రధానంగా దక్షిణ భారత దేశంలోనే ఉన్నాయి. అత్యధిక నీటి పారుదల సాంద్రత పంజాబ్‌లో ఉంది. అత్యల్ప నీటి పారుదల సాంద్రత మిజోరంలో కలదు. ఇక భారతదేశంలో ఇతర నీటిపారుదల వసతులు 11.07 శాతం ఉన్నాయి.



ఆనకట్ట రకాలు

1. భూభాగ నిర్మాణం ఆధారంగా

చెక్ డ్యామ్స్: చిన్న చిన్న నీటి ప్రవాహాలకు అడ్డంగా నిర్మించేవి

డ్రై డ్యామ్స్: వర్షాభావ ప్రాంతాల్లో నేలల సంరక్షణ కోసం ప్రవాహ దిశను మళ్లిస్తూ నిర్మించేవి.

సాడిల్ డ్యామ్స్: ప్రధాన ఆనకట్ట కారణంగా లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా నిర్మించే ఆనకట్టలు

డైక్ డ్యామ్స్: సాడిల్ ఆనకట్ట లక్షణాలతో ప్రధాన ఆనకట్టను పోలివుండే వాటిని డైక్ డ్యామ్స్ అంటారు.

కాఫర్ డ్యామ్స్: నీటిలో మునిగి ఉన్న ప్రాంతంలో నిర్మాణాలు చేయడానికి ఆ నీటిని తొలగించడం కోసం నిర్మించే డ్యామ్స్

ఓవర్ ఫ్లో డ్యామ్స్: నది నుంచి లేదా ఆనకట్ట నుంచి ప్రవహిస్తున్న నీటిని శాస్త్రీయంగా లెక్కించడానికి నిర్మించే ఆనకట్టలు

2. డిజైనింగ్, ఇంజనీరింగ్ ఆధారంగా

గ్రావిటీ డ్యామ్స్: భారీ కాంక్రీట్ డ్యామ్‌లను గ్రావిటీ డ్యామ్‌లు అంటారు. లోతైన పునాదులతో నిర్మిస్తారు.

ఆర్చ్ డ్యామ్స్: వి ఆకారంలో ఉండే నదీలోయలకు అడ్డంగా నిర్మిస్తారు.

ఉదా: ఇడుక్కీ-కేరళ(ఎత్తు 169 మీ.)

ఎమ్ బ్యాంక్ మెంట్ డ్యామ్స్: రాళ్ల మధ్య ఖాళీలను మట్టి లేదా కాంక్రీట్‌తో పూడ్చుతారు. వీటిలో ఎర్త్ ఫిల్ డ్యామ్, రాక్ ఫిల్ డ్యామ్, రబ్బర్ డ్యామ్, ఆస్ఫేట్ డ్యామ్ ఉన్నాయి.

3. నీటి నిల్వ సామర్థ్యం ఆధారంగా/ఆయకట్టుకు నీటిని అందించే సామర్థ్యం ఆధారంగా

భారత ప్రణాళికా సంఘం మన దేశంలోని నీటి పారుదల ప్రాజెక్టులను ఆయకట్టు ప్రాంతం ఆధారంగా మూడు విధాలుగా వర్గీకరించింది.

భారీ తరహా ప్రాజెక్ట్: 10,000 హెక్టార్ల కన్నా ఎక్కువ సాగు భూమికి నీటి పారుదల వసతిని కల్పించే ప్రాజెక్టు.

మధ్య తరహా ప్రాజెక్ట్: 2,000- 10,000 హెక్టార్ల మధ్య సాగు భూమికి నీటి పారుదల వసతిని కల్పించే ప్రాజెక్టు.

చిన్న తరహా ప్రాజెక్ట్: 2,000 హెక్టార్ల కంటే తక్కువ సాగు భూమికి నీటి పారుదల వసతిని కల్పించే ప్రాజెక్టు.

ప్రధాన ప్రాజెక్టులు

దామోదర్ వ్యాలీ

- దామోదర్, దాని ఉప నదులపై నిర్మించిన నాలుగు ప్రాజెక్టులను కలిపి దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు అని పిలుస్తారు.
- 1948లో దేశంలో మొట్ట మొదటి వరద నియంత్రణ కార్యక్రమంగా దామోదర్ వ్యాలీ ప్రాజెక్టును ప్రారంభించారు.
- ఈ ప్రాజెక్టు అమలు కోసం 'దామోదర్ వ్యాలీ కార్పొరేషన్'(డీవీసీ) అనే సంస్థను ఏర్పాటు చేశారు.
- డీవీసీకి సహాయపడిన సంస్థ టెన్నిస్ వ్యాలీ అథారిటీ
- డీవీసీలో భాగంగా ఊర్దిన్ ప్రతిపాదించిన డ్యామ్‌ల సంఖ్య: 7
- ఇప్పటి వరకు నాలుగు డ్యాములను నిర్మించారు. అవి.. కోనార్(కోనార్ నదిపై), పాంచెట్(దామోదర్ నదిపై), తిలయ(బారకార్ నదిపై), మైదాన్(బారకార్ నదిపై).
- ఊర్దిన్ అమెరికాలోని టెన్నిస్ వ్యాలీ అథారిటీ ఛైర్మన్
- దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు అమెరికాలోని టెన్నిస్ వ్యాలీ నమూనాను పోలి ఉంటుంది.

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్

- **నిర్మాణం ప్రారంభం అయిన సంవత్సరం:** 1955 డిసెంబరు 10
- **నిర్మాణం పూర్తి:** 1967 ఆగస్టు 4. ఇందిరాగాంధీ ప్రారంభించారు.
- ఈ ప్రాజెక్టును కృష్ణా నదిపై నందికొండ గ్రామం(నల్లగొండ) వద్ద నిర్మించారు.
- **దీని నిర్మాణ ఇంజనీర్:** కానూరి లక్ష్మణ రావు
- డ్యామ్ నిర్మాణానికి కేంద్రం ఖోస్లా కమిటీని ఏర్పాటు చేసింది.
- ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు అని ఈ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా నెహ్రూ వ్యాఖ్యానించారు.
- నాగార్జున సాగర్ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి ఎత్తయిన రాతి ఆనకట్ట. **ఎత్తు:** 124.7 మీటర్లు, **పొడవు:** 1550 మీ. నీటి నిల్వ **సామర్థ్యం:** 408 టీఎంసీలు. స్థాపిత విద్యుత్ **సామర్థ్యం:** 826 మెగా వాట్లు.
- ఈ ప్రాజెక్టుకు రెండు కాలువలు ఉన్నాయి. ఒకటి జవహర్ లాల్ నెహ్రూ కాలువ(కుడి కాలువ)- దీని పొడవు 203 కి.మీ. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు సాగునీటి వసతులను కల్పిస్తుంది. రెండోది లాల్ బహదూర్ శాస్త్రి కాలువ(ఎడమ కాలువ)- దీని పొడవు 296 కి.మీ. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, ఏలూరు, జిల్లాలకు; తెలంగాణలోని నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాకు సాగునీటి వసతులను కల్పిస్తుంది.

ఇందిరా గాంధీ కాలువ

- దీనిని రాజస్థాన్ కాలువ అని కూడా పిలుస్తారు. దీనిలో సట్లెజ్, రావి, బియాస్ మూడు నదుల నీరు ప్రవహిస్తుంది. దీని ప్రధాన కాలువ హరికే బ్యారేజ్ నుంచి ప్రారంభమవుతుంది. ఉప కాలువలు బియాస్, రావి నదుల నుంచి ప్రారంభమవుతాయి. దీని ప్రధాన కాలువ పొడవు: 650 కి.మీ. ఇది మూడు రాష్ట్రాలకు నీటి వసతులను కల్పిస్తుంది. పంజాబ్‌లో 167 కి.మీ., హర్యానాలో 38. కి.మీ., రాజస్థాన్‌లో 445 కి.మీ. ప్రవహిస్తుంది. రాజస్థాన్‌లోని థార్ ఎడారిలోని గంగానగర్, బికనీర్, జైసల్మేర్, జోథ్‌పూర్ వరకు నీటి వసతులను కల్పిస్తుంది. ఇది దేశంలోనే అతి పొడవైన వ్యవసాయ కాలువ.

నోట్: ప్రపంచంలో అత్యంత పొడవైన వ్యవసాయ కాలువ: ద గ్రాండ్ కెనాల్ - చైనా - 1776 కి.మీ. (బీజింగ్ నుంచి హాంగ్ జంగ్ నగరం వరకు కలదు).



వి.వెంకటరెడ్డి, సీనియర్ ఫ్యాకల్టీ

బయోటెక్నాలజీలో ప్రవేశానికి జీఏటీ-బీ/బీఈటీ


బయోటెక్నాలజీ విభాగాల్లో పీజీ ప్రవేశాలకు ఉద్దేశించిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ (జీఏటీ-బీ) 2024, అలాగే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ల కోసం నిర్దేశించిన బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్(బీఈటీ) 2024లకు నోటిఫికేషన్ వెలువడింది. వీటిని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తోంది. ఈ పరీక్షల సిలబస్, పార్టిసిపేటింగ్ యూనివర్సిటీలు, సీట్ల వివరాలకోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

జీఏటీ-బీ

ఈ ఎగ్జామ్ ద్వారా పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూషన్స్/యూనివర్సిటీల్లో అడ్మిషన్స్ పొందే అవకాశం లభిస్తుంది. ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/సంబంధిత విభాగాలు), ఎంటెక్(బయోటెక్నాలజీ/ సంబంధిత విభాగాలు), ఎంవీఎస్సీ(యానిమల్ బయోటెక్నాలజీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ) 30 సీట్లు, ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ(మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనెటిక్స్) 10 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో బీఎస్సీ(ఫిజికల్ సైన్సెస్/బయలాజికల్ సైన్సెస్/అగ్రికల్చర్/వెటర్నరీ/ఫిషరీస్/ఫార్మసీ/ఇంజనీరింగ్/లైఫ్ సైన్సెస్/బయోటెక్నాలజీ/జెనెటిక్స్/మైక్రోబయాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్)/ఎంబీబీఎస్/బీడీఎస్/బీవీఎస్సీ/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్/బీపీటీ/బీఈ/బీటెక్ (బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/ఫుడ్ ఇంజనీరింగ్/ఫుడ్ ప్రాసెస్ టెక్నాలజీ/డెయిరీ టెక్నాలజీ/జెనెటిక్ ఇంజనీరింగ్)/బీఎఫ్ఎస్సీ/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్(సైన్స్/అప్లయిడ్ సైన్స్)ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(జీఏటీ-బీ) వివరాలు: దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే అడుగుతారు. ఇందులో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, బయాలజీ సబ్జెక్టుల నుంచి ఇంటర్ స్థాయిలో 60 ప్రశ్నలు ఇస్తారు. అన్నింటికీ సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే అర మార్కు కోత విధిస్తారు రెండో సెక్షన్‌లో బేసిక్ బయాలజీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, సంబంధిత విభాగాలనుంచి డిగ్రీ స్థాయిలో 100 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 60 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నకు మూడు మార్కులు ఉంటాయి. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 240. పరీక్ష సమయం మూడు గంటలు.



బీఈటీ

ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా రెండు కేటగిరీల్లో మెరిట్ లిస్టలను రూపొందిస్తారు. మొదటి కేటగిరీ అభ్యర్థులకు డీబీటీ జేఆర్ఎఫ్ లభిస్తుంది. వీరు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీకి రిజిస్టర్ చేసుకోవచ్చు. ఫెలోషిప్ లెటర్ అందుకొన్న రెండేళ్లలోపు వీరు పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో చేరాల్సి ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు బయోటెక్నాలజీ/లైఫ్ సైన్సెస్/బయోమెడికల్/బయో ఇన్ఫర్మాటిక్స్/బయోకెమిస్ట్రీ/బయోఫిజిక్స్/బోటనీ/కెమిస్ట్రీ/కంప్యూటేషనల్ బయాలజీ/జెనెటిక్స్/మైక్రో బయాలజీ/ జువాలజీ స్పెషలైజేషన్‌లతో ఎమ్మెస్సీ/ఎంటెక్/ఎంవీఎస్సీ/ఎం.ఫార్మసీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పూర్తిచేసి ఉండాలి.

బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్(బీఈటీ) వివరాలు: ఇందులో కూడా రెండు సెక్షన్‌లు ఉంటాయి. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొదటి సెక్షన్‌లో జనరల్ సైన్స్, మేథమెటిక్స్, కెమిస్ట్రీ, జనరల్ ఆప్టిట్యూడ్, అనలిటికల్ క్వాంటిటేటివ్ ఎబిలిటీ, జనరల్ బయోటెక్నాలజీ అంశాల నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. అన్నింటికీ సమాధానాలు గుర్తించాలి. రెండో సెక్షన్‌లో బయోటెక్నాలజీ అంశాల నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 50 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. రెండు సెక్షన్లలో ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు నిర్దేశించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 300. పరీక్ష సమయం మూడు గంటలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 6
- **వెబ్‌సైట్:** www.nta.ac.in

మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నీట్ యూజీ

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)- అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్(నీట్) యూజీ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

నీట్ యూజీ వివరాలు: ఈ పరీక్షని ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ సహా వేరువేరు భాషల్లో నిర్వహిస్తారు. వీటిలో ఒకదాన్ని అభ్యర్థులు ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ ఎగ్జామ్‌లో మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సబ్జెక్టులో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో 35 ప్రశ్నలు ఇస్తారు. వీటన్నింటికి సమాధానాలు గుర్తించాలి. రెండో సెక్షన్‌లో 15 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో ఏవైనా పదింటికి సమాధానాలు గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు నిర్దేశించారు. మొత్తం మార్కులు 720. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడు గంటల ఇరవై నిమిషాలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1700; ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000 • **చివరి తేదీ:** మార్చి 9
- **నీట్ యూజీ 2024 తేదీ:** మే 5
- **వెబ్‌సైట్:** exams.nta.ac.in/NEET

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/XUxbz3gలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

మిథున్ చక్రవర్తికి గుండెపోటు



ప్రముఖ బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. శనివారం ఉదయం ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే కోల్‌కత్తాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యులు ఆయనకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఆయనకు రెండేళ్ల క్రితం కిడ్నీల్లో సమస్య తలెత్తడంతో ఆపరేషన్ చేశారు. మిథున్ త్వరగా కోలుకోవాలని అభిమానులు ప్రార్థిస్తున్నారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం మిథున్ చక్రవర్తికి పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించింది. పలు బాలీవుడ్, బెంగాలీ చిత్రాల్లో నటించి హీరోగా స్టార్‌డమ్ అందుకున్నారు. వివాదాస్పద చిత్రం 'కశ్మీర్‌ఫైల్స్'లో మిథున్ చక్రవర్తి తనదైన శైలిలో నటించి మెప్పించారు.

ప్రేక్షకులకు గుర్తుండిపోయే చౌర్యపాఠం



రవితేజ కథానాయకుడిగా నటించిన 'ధమాకా' చిత్రంతో దర్శకుడిగా నక్కిన త్రినాథరావు పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఆయన నిర్మాతగా మారి 'చౌర్య పాఠం' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇంద్ర రామ్ కథానాయకుడు. పాయల్ రాధాకృష్ణ హీరోయిన్. నిఖిల్ గొల్లమారి దర్శకుడు. దర్శకుడు కార్తిక్ ఘట్టమనేని ఈ చిత్రానికి కథ అందించారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్, టీజర్‌ని లాంచ్ చేసి ప్రచార కార్యక్రమాలు ప్రారంభించారు. గ్రామంలో దోపిడీకి హీరో తన ముఠాను సమాయత్తం చేయడంతో మొదలైన టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ 'నక్కిన నెరేటివ్ బేనర్స్ ఈ రోజు ప్రారంభమైంది. దీనికి ప్రేక్షకులు ఊపిరి, భవిష్యత్‌ను ఇవ్వాలి. 'చౌర్య పాఠం'లో పాత్రలు ప్రేక్షకులకు గుర్తిండిపోతాయి' అన్నారు. ఈ సినిమా కోసం నాగేంద్ర 14 సెట్స్ వేశారని ఇంద్రరామ్ తెలిపారు. త్రినాథరావు ఎక్కడా రాజీపడకుండా సినిమాను నిర్మించారని దర్శకుడు చెప్పారు.

క్రమశిక్షణ, నిజాయితీ ఆయన్ని ఉన్నత శిఖరాలకు చేర్చాయి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



'మురళీమోహన్‌లో నాకు నచ్చింది క్రమశిక్షణ, నిజాయితీ. జయాపజయాలను ఒక్కటిగా తీసుకోవడం ఆయన్ను ఉన్నత శిఖరాలకు చేర్చింది. యువత ఆయన్నుంచి ఇవన్నీ నేర్చుకోవాలి. వారు మంచి సందేశం ఉన్న సినిమాలు భవిష్యత్తులో మరిన్ని చేయాలని కోరుకుంటున్నాను' అన్నారు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. 'సకుటుంబ, సపరివార సమేతంగా చూసేలా సినిమాలు రాయండి, తీయండి. కుటుంబాలను, సంస్కృతి, సంప్రదాయాలను దృష్టిలో పెట్టుకుని సినిమాలు నిర్మించండి' అని ఆయన కోరారు. 'పీవీ నరసింహారావు గారి ముందు చూపు వల్లనే నేడు దేశం ఇంత ముందుకు సాగింది. ఆయనకు భారతరత్న రావడం చాలా ఆనందకరమైన విషయం. చంద్రబాబు సంస్కరణల వల్లనే నేడు హైదరాబాద్ టెక్నాలజీ, ఫైనాన్షియల్, ఇండస్ట్రీ హబ్‌గా మారింది' అని పేర్కొన్నారు వెంకయ్యనాయుడు. నటుడు, నిర్మాత మురళీమోహన్ 50ఏళ్ల సినీ జీవితం పూర్తిచేసుకున్న సందర్భంగా శనివారం శిల్పకళా వేదికలో గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మరో ముఖ్య అతిథి చంద్రబాబు మాట్లాడుతూ 'ఏ పనైనా మనసుపెట్టి చేసే వ్యక్తి మురళీమోహన్. సినిమాల నిర్మాణంలో, రియల్‌ఎస్టేట్ రంగంలో ఆయన అద్భుతంగా రాణించారు. ఎంతో మందిని సొంత ఖర్చులతో చదివించి డాక్టర్లు, ఇంజనీర్లుగా తీర్చి దిద్దారు. ఇక వెంకయ్యనాయుడు గారి విషయానికి వస్తే ఆయన రాజకీయాల్లో సిన్సియారిటీకి మారుపేరుగా నిలిచారు. ఆయనకు పద్మ విభూషణ్, పీవీ నరసింహారావు గారికి భారతరత్న వంటి అత్యున్నత పురస్కారాలు రావడం మనందరికీ గర్వకారణం' అన్నారు.

ఎన్టీఆర్‌లోని అనేక మంచి లక్షణాలను ఆదర్శంగా తీసుకుని మురళీమోహన్ ఎంతో ఎత్తుకు ఎదిగారని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు . చివరిగా మురళీమోహన్ మాట్లాడుతూ.. 'నేను ఇవాళ ఈ స్థాయిలో మీ ముందు ఉన్నానంటే అట్లూరి పూర్ణచంద్రరావు గారు పెట్టిన భిక్షే. 1973లో ఆయన నాకు హీరోగా అవకాశం ఇస్తే, ఇండస్ట్రీలో నన్ను నిలబెట్టారు దాసరి గారు. వీరిద్దరినీ నా జీవితంలో మర్చిపోలేను' అన్నారు. 50 ఏళ్ల క్రితం తనకు తొలి అవకాశం ఇచ్చిన అట్లూరి పూర్ణచంద్రరావుకు ఈ సందర్భంగా మురళీమోహన్ ఒక కారును బహుమతిగా అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో నాటి హీరోయిన్లు ప్రభ, జయచిత్ర, కవిత, సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు, దర్శకుడు రాజమౌళి, నిర్మాతలు అశ్వినీదత్, సురేశ్‌బాబు, సంగీత దర్శకుడు కీరవాణి, నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామల, పార్లమెంట్ సభ్యులు రఘురామ కృష్ణంరాజు, సుజనా చౌదరీ, నటుడు ప్రదీప్, కొల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

నవ్య 'దృశ్యం' పేజీలోని మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/fR1qtvv లో చదవండి.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు


గాయకులను సన్మానిస్తున్న సమితి సభ్యులు

ఘంటసాల గానం అజరామరం

● 50వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 10 : మధుర గాయకుడు ఘంటసాల గానం అజరామరమని డాక్టర్ కే.రామరాజు అన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూల్‌లో శనివారం ఘంటసాల 50వ వర్ధంతి నిర్వహించారు. అభ్యుదయ కళాసమితి, ఐఎస్‌సీయుఎఫ్ ఆధ్వర్యంలో హరికథా భాగవతారిణి నాగమణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా రామరావు మాట్లాడుతూ, పిల్లల నుండి పెద్దల వరకు ఘంటసాల గానం మానసిక ఉల్లాసాన్ని, ఆనందాన్ని అందిస్తుందన్నారు. 8 దశాబ్దాలుగా తెలుగు వారి హృదయాలలో ఆయన మధుర గానం చిరంజీవిగా నిలిపిందన్నారు. 10 వేలకు పైగా పాటలు పాడటం మాత్రమే కాకుండా సామాజిక సేవ, తల్లిదండ్రుల మాటను తూచతప్పకుండా పాటించిన మహనీయుడని కొనియాడారు. పలువురు సంగీత విద్వాంసులు, బాల బాలికలు ఘంటసాల గీతాలు ఆలపించారు. బొల్లిముంత కృష్ణ, శారద, విజయ్, నీలాంబరం, పాటిబండ్ల శ్రీనివాసరావు, రావిపాటి వీరనారాయణ, లలితేంద్ర ప్రసాద్, మార్కండేయులు, నాగప్రసాద్, లక్ష్మీసుజాత పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ కన్వీనర్ సాంబశివుడు

కాంగ్రెస్ శ్రేణులలో నూతన ఉత్తేజం

● కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 10 : పీసీసీఐ అధ్యక్షురాలు వైస్ షర్మిల నిర్వహించిన రచ్చబండ కార్యక్రమం కాంగ్రెస్ శ్రేణులలో నూతన ఉత్తేజం తెచ్చిందని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు తెలిపారు. రూరల్ మండలం కొలకలూరులో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ప్రధానపాత్ర పోషించిన మల్లవరపు ప్రసాద్‌ను మండల ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు అందజేశారు. మారీసుపేట పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ. మళ్లీ రాష్ట్రంలో కాంగ్రెస్ వైభవాన్ని చూస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, ఆయన ప్రజల అభిమానాన్ని కోల్పోయారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో షర్మిల పర్యటనలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఒక దశకు చేరుకుంటుందని గట్టి పోటీ ఇస్తుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు పొన్నూరు శశి, కర్లపూడి బుల్లియ్య, సిద్దెల రామకృష్ణ, పూర్ణ చంద్రరావు, శివన్నారాయణ, కృష్ణ, అయ్యప్ప, వీరయ్య పాల్గొన్నారు.


కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరిస్తున్న బీజేపీ నేతలు

పేదలకు అందే ప్రతి పథకం కేంద్రానిదే..

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 10 : రాష్ట్రంలో పేదలకు అందుతున్న ప్రతి పథకం కేంద్ర ప్రభుత్వం అందించినవేనని బీజేపీ జిల్లా జాయింట్ కన్వీనర్ విజయభాస్కర్ తెలిపారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలో శనివారం 'పల్లెకు పోదాం' కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నేతలు ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం చేయూత అందిస్తున్న పథకాల వివరాల కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో కూడా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, రాష్ట్రంలో కూడా మంచి అభివృద్ధి కనబడుతుందన్నారు. కార్యక్రమంలో బిట్ర కనకదుర్గ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


జ్యోతిని వెలిగించి వేడుకలను ప్రారంభిస్తున్న ఆర్డీవో మురళీమోహన్

విద్యార్థులు ప్రణాళికాబద్ధమైన కృషి చేయాలి

● ఆక్స్‌ఫర్డ్ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆర్డీవో మురళీమోహన్

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 10: విద్యార్థులు ఉన్నత స్థానం చేరేందుకు ప్రణాళిక బద్ధమైన కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆర్డీవో మురళీమోహన్ తెలిపారు. శనివారం స్థానిక ఐతానగర్ ఈటీ కాలనీలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రఖ్యాత శాస్త్రవేత్త అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని ఆయన చెప్పిన 'కలలను కనండి.. ఆ కలలను సాకారం చేసుకునేందుకు కష్టపడండి' అనే మాటలను నిత్యం గుర్తుంచుకోవాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే నైపుణ్యాలు అవసరమని, మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునేలా తమను తాము తీర్చిదిద్దుకోగలగాలని చెప్పారు. ఎంఈవో లక్ష్మీనారాయణ, స్కూల్ చైర్మన్ మర్రెడ్డి, ప్రిన్సిపల్ థామస్‌రెడ్డి ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.


సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సందడిగా సంస్కృత పాఠశాల

పూర్వ విద్యార్థుల సమావేశం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 10 : పట్టణంలోని సంస్కృత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం సందడిగా నిర్వహించారు. 110 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పాఠశాల పూర్వ విద్యార్థులంతా పెన్షనర్స్ హాలులో సమావేశమయ్యారు. కళాశాల నిర్వహణకు భవనాన్ని ఇచ్చిన దాత గుదిబండ చంద్రమౌళి శాస్త్రి, ఆర్థిక సహకారం అందించిన కోట లక్ష్మయ్య నాయుడుకు నివాళులర్పించారు. పూర్వ విద్యార్థిని లక్ష్మీపార్వతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భాషా జ్ఞానం ప్రతి ఒక్కరికి అవసరమని తెలుగు, సంస్కృత భాషల్లో ప్రావీణ్యం సాధిస్తే సంపూర్ణ జ్ఞానం పొందగలుగుతారని చెప్పారు. 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. తమ గురువులను పూర్వ విద్యార్థులు సత్కరించారు. వినాయకరావు, మురళీకృష్ణ, రామలింగేశ్వరరావు, శర్మ, అప్పారావు, వెంకటేశ్వర శాస్త్రి, శ్రీనివాసమూర్తి, జయప్రద పర్యవేక్షించారు.

ఐదేళ్లుగా అసంపూర్ణంగానే..

● ముందుకుసాగని షాదీఖానా- ఉర్దూ ఘర్ పనులు
● నిర్మాణానికి నిధులు ఇవ్వని ప్రభుత్వం
● హామీలు తప్ప ఆచరణకు పూనుకోని నేతలు
● పెరిగిన పిచ్చిమొక్కలు.. శిథిలమౌతున్న గోడలు


అసంపూర్తిగా నిల్చిపోయిన షాదీ ఖానా



పొన్నూరుటౌన్, ఫిబ్రవరి10: పొన్నూరు పట్టణంలోని ఇట్టికంపాడు రోడ్డులో ఐదేళ్ల అసంపూర్తిగా నిల్చిన షాదీఖానా ఊర్దూ ఘర్ నిర్మాణం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తుంది. పట్టణంలోని ఇట్టికంపాడు రోడ్డులో 25, 26, 27, 28, 29 వార్డుల్లో 10 వేల మంది ముస్లీం జనాభా నివసిస్తున్నారు. ఆయా ప్రజల వినతి మేరకు టీడీపీ హయాంలో 2017లో రూ.1.20 కోట్ల వ్యయంతో షాదీ ఖానా, ఊర్దూ ఘర్ నిర్మాణాని అప్పటి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ శంఖుస్థాపన చేసి పన్నులు ప్రారంభించారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. శ్లాబ్ వరకే నిర్మించిన అనంతరం సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. అనంతరం పాలకులు మారిపోవటంతో షాదీఖానాకు రాజకీయ గ్రహణం పట్టింది. వైసీపీ పాలకులు షాదీఖానా నిర్మాణానికి నిధులు నిలిపి వేయటంతో నిర్మాణం పూర్తి కాకుండా అసంపూర్తిగా ఉండి పోయింది. గడిచిన నాలుగేళ్లలో రంజాన్, బక్రీదు వంటి పండుగలు వచ్చిన ప్రతిసారి వైసీపీ నేతలు షాదీ ఖానాను పరిశీలించటం, నిధులు మంజూరు చేసామని, త్వరలోనే పూర్తి చేస్తామని హామీలు గుప్పించటం పరిపాటిగా మారింది. వైసీపీ పాలనలో షాదీఖానాకు ఒక్క రూపాయి నిధులు మంజూరు కాలేదని, ఒక్క ఇటుక పేర్చలేదని ముస్లిములు వాపోతున్నారు. షాదీ ఖానా పూర్తయి ఉంటే నామమాత్రపు ధరకు 10 వేల మంది జనాభాకు షాదీఖానాలో కార్యక్రమాలు జరిపించుకునే అవకాశం లభించివుండేదని ముస్లింలు అంటున్నారు. అలాగే ఊర్దూ ఘర్ పేరుతో ముస్లింల సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునే వెసులుబాటు కలిగివుండేదని అన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా షాదీఖానాలో పిచ్చిచెట్లు పెరిగి ఉన్నా యి. అప్పటికే నిర్మించిన గోడలు ఎండకు ఎండి, వానకు తడిచి శిధ్దిలమైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఆ ప్రాతంలో అసాంఘిక శక్తులు రాత్రుల్లో మద్యం తాగటం, వివిధ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్ని ముస్లింలు వాపోతున్నారు. ఎన్నికల ముందు ముస్లింల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామన్ని చెప్పి అనంతరం అధికారం చేపట్టాక కనీసం ముస్లింల షాదీఖాన నిర్మాణానికి నిధులివ్వని వైసీపీ నేతల తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిజంగా ముస్లిం సంక్షేమంపై చిత్తశుధ్ధి వుండివుంటే పది వేల జనాభాకు ఉపయోగపడే షాదీ ఖానా ఊర్దూ ఘర్‌కు నిధులిచ్చి నిర్మాణాలు పూర్తి చేసివుండేవారని అంటున్నారు. ఇప్పటికైన కల్లబొల్లిమాటలు హామీలను పక్కనపెట్టి చేతల్లో నిరూపించేలా వ్యవహరించి షాదీఖానా నిర్మాణాని పూర్తి చేయాలన్ని ఆ ప్రాంత ముస్లింలు పాలకులకు సూచించారు.

తెనాలి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తా

● సీసీఎల్ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్
● పట్టణంలోని పలు కూడళ్లలో స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు



ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 10: తెనాలి ప్రాంత అభివృద్ధికి మునుముందు మరింత తోడ్పాటునందిస్తానని సీసీఎల్ కాంటినెంటల్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టణంలోని పలు కూడళ్లలో సీసీఎల్ కాంటినెంటల్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఏర్పాటు చేసిన స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను చల్లా రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే శివకుమార్‌లు శనివారం ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో చల్లా రాజేంద్రప్రసాద్‌కు ఘనంగా పౌరసన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ తెనాలి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామన్నారు. పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆసమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన చల్లా రాజేంద్రప్రసాద్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. చల్లా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో తెనాలి పట్టణ ప్రజలకు మంచి జరిగే ఏ పనిలోనైన తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ప్రఖార్‌జైన్, డీఎస్పీ జనార్ధనరావు, మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పలువురు కౌన్సిలర్లు, ఐనాల మల్లేశ్వరరావు, పలు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పాడిరైతు కుటుంబానికి ఆర్థిక సాయం అందచేస్తున్న 'సంగం' అధికారులు

పాలరైతు కుటుంబానికి అండగా సంగం డెయిరీ

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి10 : మండల పరిధిలోని నండూరు గ్రామంలో మృతి చెందిన పాల రైతు కుటుంబానికి సంగం డెయిరీ అండగా నిలిచింది. నండూరు గ్రామానికి చెందిన పొరి సుబ్బారావు శనివారం మృతి చెందాడు. సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు, మేనేజర్ కాట్ర నరేష్ బాబు తదితరులు సుబ్బారావు మృతదేహాన్ని సందర్శించి నివాళ్లు అర్పించారు. సుబ్బారావు కుటుంబ సభ్యులకు రూ. 10 వేలు మట్టి ఖర్చుల నిమ్మిత్తం అందించారు. డివిసి అభయ పథకం ద్వారా సుబ్బారావు కటుంబ సభ్యులను ఆదుకోనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంగం అధికారులు, టీడీపీ నాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ డాక్టర్ షైని, వైస్ ప్రిన్సిపాల్ శారద

జేఎంజేలో ప్రాంగణ ఎంపికలు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 10: స్థానిక చెంచుపేటలోని జేఎంజే మహిళా కళాశాలలో శనివారం మ్యాన్ ఫవర్ మెనేజ్‌మెంట్ సర్వీసెస్, శ్రీసిటీ, డైకిన్ ఎయిర్ కండీషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఎట్ శ్రీసిటీ, టాటా, హీరో మోటో కార్పొరేషన్ కంపెనీల ప్రతినిధులు డిగ్రీ తృతీయ సంత్సవరం చదువుతున్న విద్యార్థినులకు ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. డైకిన్ కంపెనీ 57 మందిని, హీరో కంపెనీ 85 మంది విద్యార్థినులును ఉద్యోగాలకు ఎంపిక చేశారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాడెంటు డాక్టర్ సిస్టర్ థెరిస్సామ్మ పాల్గొని క్యాంపస్ డ్రైవ్‌లో ఎన్నికైన విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైని, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ శారద, ట్రైనింగ్, ప్లేస్‌మెంటు ఆఫీసర్ డాక్టర్ జీ. సుధాకరయ్య, పీ. శంకర్, ఎస్ కిరణ్ కమిటీ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌ల సేవలు అభినందనీయం

తెనాలి,మారీసుపేట ఫిబ్రవరి10: మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలో పేదల ఆకలి తీర్చుతున్న అన్న క్యాంటీన్‌ల సేవలు అభినందనీయమని పలువురు కొనియాడుతున్నారు. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో శనివారం ఎన్నారై విద్యాసంస్థల యాజమాన్యం సహకారంతో, శివాజీచౌక్ వద్ద గల అన్నక్యాంటీన్‌లో ఆలపాటి రాజా దంపతుల సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాదల కోటేశ్వరరావు, గుమ్మడి ప్రసాద్, సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, కొత్తపల్లి రమేష్, ముళ్ళపూడి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దయానంద సరస్వతి

ద్విశతాబ్ది జయంతి ఉత్సవాలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 10 : రూరల్ మండలం నందివెలుగులో మహర్షి దయానంద సరస్వతి ద్విశతాబ్ది జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో శనివారం శోభాయాత్ర నిర్వహించారు. ఆర్య సమాజ స్థాపకులు దయానంద బోధనలను ఆర్య సమాజ అధ్యక్షుడు మాఘం కృష్ణమూర్తి వివరించారు. ఆచార్య హరిప్రసాద్, ధర్మతేజ, విశ్వనాథ్, రవీంద్రనాథ్, గంగాపార్వతి, రామమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో రక్తదాన శిబిరం

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 10: పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో శనివారం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిల్ కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేయడంతో సమానమని అన్నారు. కార్యక్రమంలో పేథాలజీ డాక్టర్ హితంకి, హెడ్ నర్స్ సుజాత, కౌన్సిల్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నెహ్రూనికేతన్ విద్యార్థుల స్వర్ణోత్సవ ర్యాలీ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 10 : బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్ విద్యార్థులు శనివారం స్వర్ణోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని స్కూల్ వ్యవస్థాపకులు దాసరి ప్రకాశరావు, ఎండీ మురళీకాంత్, ఈడీ గీతాకాంత్‌లు జెండా ఊపి ప్రారంభించారు. బోసురోడ్డులోని పాఠశాల నుంచి పట్టణంలోని పలు ప్రధాన ప్రాంతాలలో ర్యాలీ సాగింది. స్కూల్ స్థాపించి 50 ఏళ్లు కావడంతో విద్యార్థులు, బోధన సిబ్బంది నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.

సదాసీదాగా ముగిసిన

మండల సర్వసభ్య సమావేశం

● అధికారుల హాజరు నామమాత్రమే..
● వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు
● మండల పరిషత్ అధ్యక్షుడు తులిమిల్లి శ్రీనివాసరావు


ప్రసంగిస్తున్న ఎంపీపీ తులిమిల్లి శ్రీనివాసరావు

పెదకాకాని, ఫిబ్రవరి 10: మండల పరిషత్ అభివృద్ధికి శక్తి వంచను లేకుండా కృషి చేస్తామని మండల పరిషత్ అధ్యక్షుడు తులిమిల్లి శ్రీనివాసరావు తెలిపారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. అనేక శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. దీంతో మండల సర్వసభ్య సమావేశం పేలగా ముగిసింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గ్రామపంచాయతీలను అభివృద్ధి వైపు నడిపిస్తూ అనేక అభివృద్ధి పనులను జరిపిస్తున్నామన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గడచిన నాలుగు నెలల మండలంలో అభివృద్ధి పెద్ద ఎత్తున జరిపించామన్నారు. మండల పరిషత్ సాధారణ నిధులతో గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయిన్లు, కాల్వకట్టల నిర్మాణం చేపట్టామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి సమస్యను అధిగమించేందుకు ప్రతి ఎంపీటీసీ సెగ్మెంట్ పరిధిలో నిధులు కేటాయించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని, అన్ని గ్రామాల్లోని తాగు నీటి చెరువులను నీటితో నింపాలని ఆదేశించామన్నారు. ఎండీవో నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల నుంచి ఇప్పటికే డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సేకరించామని, త్వరలో దాన్ని అమలు చేస్తామన్నారు. తద్వారా గ్రామాల్లో తాగునీటి సమస్యపూర్తిగా తొలగిపోతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


ధూళిపాళ్ల, దువ్వారపు, కొనకల తదితరులను గజమాలతో సత్కరిస్తున్న బీసీలు

టీడీపీతోనే బీసీల సంక్షేమం అభ్యున్నతి

● నాడు ఎన్టీఆర్ నుండి నేడు చంద్రబాబు వరకు బీసీలకు అండగా..
● త్వరలో జరిగే ఎన్నికల్లో సమష్టిగా టీడీపీ - జనసేనను బలపరచాలి
● పెదకాకానిలో 'జయహో బీసీ' సభ సూపర్ సక్సెస్
● పెద్ద ఎత్తున తరలివచ్చిన బీసీలు.
● ప్రసంగించిన మాజీ ఎంపీ కొనకళ్ళ, ధూళిపాళ్ల, జనసేన నేతలు

పెదకాకాని, ఫిబ్రవరి 10 : టీడీపీ తోనే బీసీల సంక్షేమం.. అభ్యున్నతి అని మాజీ ఎంపీ కొనకల నారాయణ స్పష్టంచేశారు. శనివారం మండల కేంద్రమైన పెదకాకాని మెయిన్ సెంటర్‌లో 'జయహో బీసీ' బహిరంగ సభను నిర్వహించారు. సభకు పొన్నూరు నియోజకవర్గ బీసీ నేత ముద్రబోయిన సూరిబాబు అధ్యక్షత వహించారు. తొలుత మెయిన్ సెంటర్ లోని ఎన్టీఆర్, అంబేద్కర్, గౌతు లచ్చన్న విగ్రహాలకు పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ.. నాడు ఎన్టీ రామారావు నుంచి నేటి చంద్రబాబు వరకు బీసీల గురించి ఆలోచించే పార్టీ టీడీపీయేనని స్పష్టం చేశారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బీసీలంతా సమష్టిగా టీడీపీ - జనసేన కూటమిని బలపరచాలని, వైసీపీని సమాజం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి వీపీ సింగ్ హయాంలో బీసీలకు 24 శాతం రిజర్వేషన్ ఇస్తే, చంద్రబాబు తన మేధాశక్తితో బీసీలకు రిజర్వేషన్ కల్పించి, బీసీల అభ్యున్నతికి పాటు పడ్డారని తెలిపారు.

పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ సమాజంలో సగ భాగంవున్న బీసీలు తరతరాలుగా అణచివేత గురవుతున్నారని, బీసీల సంక్షేమానికి అన్న ఎన్టీఆర్ పాటుపడ్డాడన్నారు. బీసీలు అంటే తలవంచుకునే వ్యక్తులు కాదని తల ఎత్తుకునే వాళ్ళు అని నిరూపించిన మహా నేత చంద్రబాబు అని అన్నారు. వివిధ కుల వృత్తులపై ఆధారపడి జీవించే బలహీనవర్గాల వారికి ఎన్నో సంక్షేమ పథకాలను ఎన్టీఆర్ అందించారన్నారు. బీసీలకు అందాల్సిన అనేక సంక్షేమ పథకాలను తీసివేసి జగన్ రెడ్డి తీరని అన్యాయం చేశారన్నారు. జగన్ ఎంతసేపటికి పెన్షన్లు, అమ్మ ఒడి తప్ప మరేది చెప్పరని, టీడీపీ హయాంలో ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను తీసివేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. బీసీలు అంటేనే టీడీపీ అని.. టీడీపీ అంటే బీసీలు అని నరేంద్ర స్పష్టం చేశారు.


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు.

ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోని బీసీలకు న్యాయం జరిగిందన్నారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి, బీసీలకు అన్ని విధాలుగా గుర్తింపు తెచ్చారన్నారు. ఈనాడు అధికారంలో ఉన్న వైసీపీ ఎన్నో అబద్ధాలు చెప్తుందని, బీసీలకు ఏనాడు సముచితంగా స్థానం కల్పించలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజాసంక్షేమంలో బీసీలకు అగ్ర తాంబూలం అందించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. ప్రజలంతా చైతన్యవంతులై వచ్చే ఎన్నికల్లో టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని రామారావు పిలుపునిచ్చారు.

జనసేన పార్టీ రాష్ట నేత బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ టీడీపీ - జనసేన పార్టీల ప్రభంజనంలో వైసీపీ కొట్టుకుపోతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీ, జనసేన కూటమిని బలపరచాలని కోరారు. ప్రజలకు మేలు జరగాలంటే వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. పొన్నూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ సారథ్యంలో మరో రెండునెలల్లో కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది అన్న దీమా వ్యక్తం చేశారు. అందుకు ప్రజలంతా సిద్ధంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాళ్ల వెంకటేష్ యాదవ్, రాష్ట్ర నగర సాధికార కన్వీనర్ జంపని శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు గుంటుపల్లి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే, పొన్నూరు నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు దివి శివరాం, స్థానిక బీసీ నాయకులు, అన్ని గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన నంబూరు వైసీపీ నాయకులు

టీడీపీలోకి భారీగా చేరిన వైసీపీ నాయకులు..

పెదకాకాని సెంటర్లో జరిగిన జయహో బీసీ బహిరంగ సభలో నంబూరు గ్రామం వైసీపీ మండలం బీసీ సెల్ అధ్యక్షులు పడమట జగదీశ్ కుమార్(చిన్ని), నంబూరు గ్రామం మాజీ ఎంపీటీసీ మేడా శ్రీనివాసరావు, వైస్సార్సీపీ పార్టీ గ్రామం బూత్ కమిటీ అధ్యక్షులు వూయ్యూరు వెంకటరెడ్డి, తమ్ముండ్రు శివనాగేశ్వరరావు ఆధ్వర్యంలో 40 కుటుంబ సభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి మహమ్మద్ మోసిన్, రాష్ట్ర పార్టీ నాయకులు కూసం బ్రహ్మరెడ్డి, షేక్ సాబీర్, జొన్నల మురళీకృష్ణారెడ్డి, భీమవరపు సాంబిరెడ్డి, తాడిబోయిన గంగాధరరావు, కఠారి శ్రీను, దానబోయిన బాజీవెంకట్రావు, సాంబశివరావు, తోకల కోటేశ్వరరావు, గ్రామంలోని పార్టీ నేతలు పాల్గొన్నారు.

దేశానికి మోదీ నాయకత్వం అవసరం

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబశివరావు

కొల్లిపర, ఫిబ్రవరి 10 : దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం అవసరమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబశివరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని దావులూరులో బీజేపీ నాయకులు 'పల్లెకుపోదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకులు గ్రామంలో తిరుగుతూ కేంద్రం ప్రభుత్వం ద్వారా పేదప్రజలకు చేసిన సదుపాయాలు గురించి వివరించారు అనంతరం పార్టీలో చేరిన వారిని కండువాతో ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మునగాల కృష్ణమూర్తి, తెనాలి అసెంబ్లీ కన్వీనర్ కఠారు వాసుదేవనాయుడు, జిల్లా కార్యదర్శి కన్నెగంటి ప్రశాంతి, మండల ప్రధాన కార్యదర్శి అశ్వనీకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మండ్రు మురళి పాల్గొన్నారు.


చందు సాంబశివరావు సమక్షంలో బీజేపీలో చేరిన పలువురు